
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 30 ఏప్రిల్ 2024





నిలిచిపోయిన జేజేఎం పైపులైన్ పనులు



నీరుగార్చారు..!

వైసీపీ ప్రభుత్వం వల్లే జిల్లాలో నీటి ఎద్దడి

- టీడీపీ హయాంలో రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు
- పనులు పురోగతిలో ఉండగా నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- వాటర్ మిషన్ పేరుతో కొద్దిరోజులు హడావిడి
- ఆ తర్వాత తెరపైకి కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్
- కేంద్రం నిధులు విడుదల, రాష్ట్రం నుంచి రూపాయి వస్తే ఒట్టు
- ఈ పనులకు కూడా అర్ధంతరంగా బ్రేక్
- ఐదేళ్లుగా ఉమ్మడి కృష్ణాలో తీవ్ర తాగునీటి సమస్య

ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రతిష్టాత్మక పథకాన్నైనా.. అది ఏ ప్రభుత్వ ఆలోచన అయినా.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తప్పనిసరిగా కొనసాగిస్తుంది. కానీ, కేవలం టీడీపీపై ద్వేషం, పగతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ప్రజాపయోగ పథకాలెన్నింటినో రద్దు చేసింది. అందులో ముఖ్యమైనదే రూ.1,000 కోట్ల అంచనాతో కృష్ణాజిల్లా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇంటింటికీ రక్షిత మంచినీటి పథకం. టీడీపీ హయాంలో శరవేగంగా ప్రారంభమైన ఈ వాటర్ గ్రిడ్ పనులను వైసీపీ వచ్చి అర్ధంతరంగా రద్దు చేసింది. దాని స్థానే.. కేంద్ర ప్రాయోజిత పథకం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా వాటర్ మిషన్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిన వైసీపీ చివరికి ఆ పనులనూ పూర్తిచేయకుండా మధ్యలోనే వదిలేసింది. ఫలితంగా కృష్ణానది చెంతనే ఉన్నా వేసవిలో జిల్లావాసులు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

టీడీపీ హయాంలో..

• రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు

గ్రామీణ ప్రాంతాలకు రక్షిత మంచినీటిని అందించటానికి కిందటి టీడీపీ ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. మొత్తం 970 పంచాయతీల్లో తలసరి మంచినీటి సరఫరాను 40 నుంచి 70 శాతానికి తీసుకెళ్లాలనుకుంది. మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 2,484 రూరల్ ప్రాంతాలను గుర్తించింది. నూరుశాతం కనెక్షన్లు ఇవ్వాలని సూచించింది. మొత్తంగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి రూ.994.26 కోట్లతో పిలిచిన టెండర్లను మేఘా సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. 2019 ఎన్నికలకు ముందే ఈ పనులు ప్రారంభమయ్యాయి. విజయవాడ నగరం మినహా 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమాంతరంగా పనులు ప్రారంభమయ్యాయి. ఎంచుకున్న గ్రామాల్లో పైపులైన్లు, కుళాయి కనెక్షన్ల పనులు చేపట్టారు.

వైసీపీ వచ్చాక..

• రూ.1,000 కోట్ల పనులు ఆపేశారు

ఎన్నికల జరిగి, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటికీ బ్రేక్ వేసింది. గత ప్రభుత్వ పథకాన్ని అర్ధంతరంగా రద్దు చేసింది. 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్న పేరుతో కాంట్రాక్టును రద్దు చేసింది. దీనిపై గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. నాలుక్కరుచుకున్న వైసీపీ ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసింది. వాటర్ మిషన్ పేరుతో సమీక్ష చేపట్టింది. గత ప్రభుత్వ పథకాన్ని విస్తరిస్తామని చెప్పింది. మున్సిపాలిటీలు, పారిశ్రామిక అవసరాలను తీర్చటానికి వీలుగా సమగ్ర నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ను కోరింది. ఉమ్మడి కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేయనున్నట్టు ప్రకటించింది. అయితే, ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే రూ.1,000 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీనిని దాదాపుగా రెండేళ్ల పాటు తొక్కిపెట్టారు.

జేజేఎం పనులకూ మంగళం

కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పేరుతో కేంద్ర ప్రాయోజిత పథకానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. జిల్లాలవారీగా డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే, అందులో సగం మొత్తాన్ని కేంద్రమే భరిస్తుంది. మిగిలిన సగం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గతంలో వాటర్ మిషన్‌కు తయారు చేయించిన డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వం ఆ డీపీఆర్‌ను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తొలి దశలో రూ.741 కోట్లతో జేజేఎం పనులు చేపట్టేందుకు ఎన్టీఆర్ జిల్లాకు అనుమతి ఇచ్చింది. టెండర్లకు అనూహ్య స్పందన వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడంతో రూ.121 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. వీటి వరకు పనులు పురోగతిలో ఉన్నాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ జమకాకపోవటంతో కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. ఆ ప్రభావం రెండో దశ పనులపై పడింది. రూ.117 కోట్లకు సంబంధించి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రాకపోవడంతో పనులు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. రూ.100 కోట్ల మూడో దశ పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. వరుసగా ఐదుసార్లు టెండర్లు పిలిచినా స్పందనా రాకపోవటంతో అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో జేజేఎం పనులు నిలిచిపోయాయి.

బ్యాంకులా.. బాబోయ్..!

మళ్లీ మొదలైన పెన్షన్ టెన్షన్

- సచివాలయాల్లో కానీ, ఇంటింటికీ వచ్చి కానీ ఇవ్వాలంటున్న పెన్షనర్లు
- ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరగలేమని ఆవేదన
- క్యూల్లో నిలబడలేం.. ఫాంలు పూర్తిచేయలేమని విజ్ఞప్తి
- జిల్లావ్యాప్తంగా పెన్షన్లలో 70 శాతం పైబడి వృద్ధులే అధికం

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : పెన్షన్ తలనొప్పి మళ్లీ మొదలైంది. జిల్లావ్యాప్తంగా డీబీటీ విధానంలో పెన్షన్ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండటం పింఛన్‌దారుల్లో ఆందోళన కలిగిస్తోంది. డీబీటీ విధానం అంటే అందరూ బ్యాంకులకు వెళ్లాల్సి ఉంటుంది. పెన్షన్లు ఇవ్వటానికే బ్యాంకులు పనిచేయవు. అదనపు సిబ్బంది ఉండరు. ఈ విధానం వల్ల బ్యాంకుల్లో గంటల తరబడి పడిగాపులు పడాల్సి ఉంటుందని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. మండుటెండల్లో వృద్ధులు బ్యాంకులకు వెళ్లగలరా?, వెళ్లినా క్యూల్లో నిలబడగలరా?, డబ్బు తీసుకునే విత్‌డ్రా ఫాంలను పూర్తిచేయగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సచివాలయాలే బెటరా..?

గ్రామాల్లోని సచివాలయాల్లో పెన్షన్లు తీసుకోవాలంటేనే అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. గతనెల పెన్షన్ తీసుకోవటానికి మూడు రోజుల సమయం కూడా పట్టింది. మండలంలో ఒకేఒక బ్యాంకు శాఖ ఉంటుంది. అంటే ఆయా గ్రామాల, వార్డుల్లోని పెన్షన్‌దారులంతా ఆ బ్యాంకు దగ్గరకే వెళ్లడం వల్ల రద్దీ పెరుగుతుంది. వందల సంఖ్యలో వచ్చే వృద్ధులకు బ్యాంకులు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి లేదు. భారీ ఎండల్లో వృద్ధులకు ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదనే వాదన వినిపిస్తోంది. బ్యాంకుల్లో కంటే సచివాలయాల్లో తీసుకోవడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ఎండలను దృష్టిలో పెట్టుకుని ఇంటివద్దే పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

సగం పెన్షన్లు వృద్ధులవే..

జిల్లాలో రెండు లక్షల 43వేల 400 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.71.75 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. సామాజిక పింఛన్లు పొందేవారిలో అధికశాతం మంది బ్యాంకు ఖాతాతో ఆధార్ లింకు లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం 75 శాతం మంది పింఛన్‌దారులకు బ్యాంకు ఖాతాలున్నాయని, ఖాతాల్లోనే పింఛన్ సొమ్ము జమ చేస్తామని చెబుతోంది. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు సక్రమంగా పనిచేయని పరిస్థితి కూడా ఉంది. ప్రభుత్వం పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాలో జమచేస్తే ఎంతమేర నగదు జమ అవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

తప్పు ఎవరిదీ..!

ఆది నుంచి వివాదాస్పదంగా గుడివాడ ఆర్‌డీవో

గుడివాడ ఆర్‌డీవో, ఆర్వో పి.పద్మావతి తీరు వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్యే కొడాలి నాని సమర్పించిన నామినేషన్ పత్రంలో తప్పులున్నా.. టీడీపీ నాయకులు ఆధారాలతో సహా వాటిని నిరూపించినా ఆమె వ్యవహరించిన తీరు అధికార పార్టీకి అనుకూలంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందడంతో స్పందించిన ఆర్వో నామమాత్రంగా నోటీసులు పంపడం, కొడాలి నాని తప్పు ఒప్పుకొన్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక రహస్యమేమిటనే ఆరోపణలు వస్తున్నాయి.

- ఎమ్మెల్యే కొడాలి నాని నామినేషన్ ఆమోదంలోనూ అంతే
- ప్రభుత్వ వసతి వినియోగించుకోలేదని పేర్కొన్న నాని
- ఉపయోగించుకున్నారని ఆధారాలతో సహా చూపిన టీడీపీ
- టీడీపీ నాయకులపై చిందులు తొక్కిన ఆర్‌డీవో
- ఈసీ జోక్యంతో నామమాత్రంగా నోటీసు జారీ
- నాని తప్పును ఒప్పుకొన్నా చర్యలకు మీనమేషాలు
- మొదటి నుంచి వైసీపీకి అనుకూలమేనంటున్న ప్రతిపక్షాలు



కొడాలి నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్‌డీవో పద్మావతి (ఫైల్)

గుడివాడ : కొడాలి నాని మంత్రిగా పనిచేసిన సమయంలో పౌరసరఫరాల శాఖ పాత మున్సిపల్ కార్యాలయాన్ని తన క్యాంపు కార్యాలయంగా అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. 2022, నవంబరు 30 నాటికి పౌరసరఫరాల శాఖ ఒప్పందం ముగిసింది. ఆ తరువాత కొడాలి నాని సదరు భవనాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంగా మార్చుకునేందుకు గుడివాడ మున్సిపాలిటీకి అర్జీ పెట్టుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వరకు ఆ భవనం నాని ఆధీనంలోనే ఉంది. 2024, మార్చి 17వ తేదీన సదరు భవనాన్ని నాని నుంచి స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఆర్‌డీవో, రిటర్నింగ్ అధికారి పి.పద్మావతికి పత్రాలను సమర్పించారు.

నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం

కొడాలి నాని తన నామినేషన్ పత్రాల్లో ఎటువంటి ప్రభుత్వ వసతిని వినియోగించుకోలేదని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ, అది తప్పుడు సమాచారమని రిటర్నింగ్ అధికారికి ముందే తెలుసు. స్క్రూటినీ సమయంలో టీడీపీ నాయకుల నుంచి ఫిర్యాదు వచ్చినా స్వీకరించకుండా, నామినేషన్‌కు ఆమోదం తెలపాలని ముందే ఆర్వో సిద్ధమయ్యారు. అభ్యంతరాలున్నాయా అని కూడా అడగకుండా ఆమోదం తెలిపారు. అభ్యంతరం తెలిపేందుకు లేచి నిలబడిన టీడీపీ నాయకులను పట్టించుకోలేదు. అంతేకాదు.. వారిపై తీవ్రస్థాయిలో చిందులు తొక్కారు.

నామమాత్రంగా నోటీసులిచ్చి..

ఈ విషయంపై టీడీపీ నాయకులు జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించి నామమాత్రంగా నోటీసులు జారీ చేశారు. నాని పాత మున్సిపల్ కార్యాలయాన్ని వినియోగించుకున్న పత్రాలను టీడీపీ నాయకులు చూపించారు. పూర్తిస్థాయిలో అద్దెను కూడా చెల్లించలేదని ఆరోపించారు. నోటీసుకు స్పందించిన కొడాలి నాని తాను పాత మున్సిపల్ కార్యాలయాన్ని వినియోగించుకున్నట్లు ఒప్పుకొంటూ అద్దె బకాయిలను చెల్లించినట్లు ఎన్‌వోసీని ఆర్వోకు సమర్పించారు. దీంతో అసలు బండారం బయటపడింది. నామినేషన్ పత్రాల్లో ప్రభుత్వ వసతిని వినియోగించుకోలేదని నాని ఒప్పుకొన్నారు. మళ్లీ నోటీసుకు జవాబుగా ప్రభుత్వ భవనాన్ని కార్యాలయంగా వినియోగించుకున్నానని చెబుతూ పత్రాలను సమర్పించారు. తాను తప్పు చేసినట్లు నాని ఒప్పుకొన్నా ఆర్వో చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలేవీ..?

వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్‌ను ఏకపక్షంగా ఆమోదం తెలపడం అనుమానాలకు తావిస్తోంది. చేతిలో అధికారం ఉందనే ఆర్వో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కావాలనే ఎన్నికల కమిషన్ నిబంధనలు తుంగలో తొక్కారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

జంపింగ్ జపాంగ్

నిన్నటి వరకు తిట్టి.. నేడు ప్రచారానికా..

వైసీపీలోకి వచ్చిన వలస నేతలకు సీన్ రివర్స్

కుడితిలో పడ్డ ఎలకల్లా తయారైంది వైసీపీలోకి వలస వచ్చిన కొత్త నాయకుల పరిస్థితి. సొంత పార్టీలో ఇమడలేక ఎన్నికల ముందు వైసీపీలో చేరిన జంపింగ్ జంపాంగ్‌లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. నిన్నటివరకు జగన్‌ను తిట్టిపోసిన నాయకులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని డివిజన్‌లో ప్రచారం చేస్తారని కొందరు నాయకులు ముఖం మీదే 'దయచేసి రావొద్దని' చెప్పేస్తున్నారు. చేసేదేమీ లేని కొంతమంది వలస నాయకులు సొంతంగా ప్రచారం నిర్వహించుకోవడమో, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడమో చేస్తుండగా, మరికొంతమంది మనకెందుకులే అని ఇళ్లకే పరిమితమవుతున్నారు.

- ప్రచారాలకు రావొద్దని తెగేసి చెబుతున్న పాత నేతలు
- చేసేదేం లేక ఇళ్లకే పరిమితమవుతున్న వలస నేతలు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో జనసేన, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కొంతమంది అసంతృప్తులు వైసీపీలో చేరారు. విజయవాడ ఎంపీ కేశినేని నానితో పాటే ఆయన అనుచరులు కొందరు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడిగా ఉన్న పోతిన వెంకట మహేశ్ పశ్చిమ సీటు కోసం విశ్వప్రయత్నాలు చేసి చివరికి వైసీపీలో చేరారు. అలాగే, 'తూర్పు'లో కొంతమంది నేతలను వైసీపీ అధిష్ఠానం పిలిపించుకుని దేవినేని అవినాశ్‌కు పనిచేయాలని చెప్పింది. పార్టీ అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ, వీరు ఇప్పుడు ఎటూ కదలడం లేదు. ఎవరి పనులు వారే చేసుకుంటుకున్నారు. ఇక పశ్చిమ, సెంట్రల్ నుంచి వైసీపీలో చేరిన నేతలకు క్షేత్రస్థాయిలో విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

సీన్ రివర్స్

గతంలో వైసీపీ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను వారంతా వ్యతిరేకించారు. ప్రభుత్వంపైన, సీఎం జగన్‌పైన విమర్శలు చేస్తూ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. రాజకీయ పరిణామాలు మారాక వైసీపీ కండువాలు కప్పుకొని కొత్త అవతారమెత్తారు. ఇప్పుడు ఈ నేతలంతా వైసీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో తమకు పట్టు ఉందని నిరూపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిగడప తొక్కాలనుకున్నారు. దీనిని డివిజన్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు వ్యతిరేకిస్తున్నారు. తమ డివిజన్లలో ప్రచారం చేయొద్దని, అసలు ప్రచారానికే రావొద్దని స్పష్టం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం వరకు వైసీపీ, జగన్, ప్రభుత్వంపై దారుణంగా విమర్శలు చేసిన ఈ నేతలంతా ప్రచారం చేస్తే అసలుకే ఎసరు వస్తుందన్న భావనలో డివిజన్ కమిటీలు ఉన్నాయి. తాము ప్రచారానికి వస్తున్నామని డివిజన్ కమిటీలకు వారు సమాచారం పంపగానే.. 'దయచేసి వద్దు' అనే సమాధానం వెళ్తోంది. ఈ పరిణామాలను జీర్ణించుకోలేక వలస నేతలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మరికొంతమంది తమ ఇళ్లకు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో మమ.. అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. ముందుందు ఎలాంటి పరిణామాలను చూడాల్సి వస్తుందోనని కలవరపడుతున్నారు.

సమావేశాలతో సరి

వలస నేతలకు క్షేత్రస్థాయిలో వైసీపీ డివిజన్ కమిటీల నుంచి నిస్సహాయత ఎదురవడంతో పార్టీలో తమ ముద్ర వేయించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. స్థానిక నేతల సహాయం లేకుండా ప్రచారం చేస్తే వివాదాలు ముసురుకుంటాయని భావిస్తున్నారు. దీంతో కొత్త నేతలు సొంత ప్రణాళికలను అమలు చేసుకోవాల్సి వస్తోంది. అధికార పార్టీ అభ్యర్థుల తరఫున తామూ ప్రచారం చేశామని చెప్పుకోవడం కోసం సొంతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు, అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాము పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేశామని అధినాయకులకు చూపించుకుంటున్నారు. కొత్తగా పార్టీలో చేరిన నేతలకు ఇప్పటికే ఉన్న నేతలు సహకరించకపోవడంతో గ్రూపులు ఏర్పడుతున్నాయి. కష్టమంతా తమదంటే, తమదంటూ చెప్పుకోవడానికి గ్రూపులవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లి..

గ్రామీణ ప్రాంతాల్లో భిన్న వాతావరణం కనిపిస్తోంది. ఉదయం వరకు ఒక పార్టీ కండువాను కప్పుకొన్న నేతలు సాయంత్రానికి కొత్త కండువా వేసేసుకుంటున్నారు. జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వ్యక్తి మూడు రోజుల్లో మూడు పార్టీలు మారాడు. కరిసే మధు అనే వ్యక్తి జైభీమ్‌రావు భారత్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశాడు. రిటర్నింగ్ అధికారి ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ మర్నాడు ఆయన టీడీపీ కండువా కప్పుకొన్నాడు. సోమవారం ఉదయం వరకు మధు మెడలో టీడీపీ కండువా కనిపించింది. సాయంత్రానికి అది కూడా మారిపోయింది. వెంటనే వైసీపీలో చేరి ఫొటోలకు పోజులిచ్చాడు.

చివరికి ఎవరు?

నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మిగిలింది వీరే..

- కృష్ణాలో ఏడు అసెంబ్లీలకు 79 మంది, మచిలీపట్నం పార్లమెంట్‌కు 15 మంది
- విజయవాడ పార్లమెంట్‌కు 17 మంది
- ఎన్టీఆర్‌లో మూడు అసెంబ్లీ స్థానాలకు 44 మంది
- మిగిలిన నాలుగు అసెంబ్లీల లెక్క నేడు

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వివరాల లెక్కతేలింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల తరఫున పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 79 మంది అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు 44 మంది అభ్యర్థులు, విజయవాడ పార్లమెంట్ స్థానానికి 17 మంది బరిలో నిలిచారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా మిగిలిన నాలుగు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థుల వివరాలను మంగళవారం ప్రకటించనున్నారు.

వైసీపీ మునుగుతున్న నావ!

రాజీనామా రాజకీయం!



అవనిగడ్డలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

- వలంటీర్లపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న ఐప్యాక్, అధికారపార్టీ నేతలు?
- వైసీపీ సేవలో తరించే కొందరి సంతకాలతో మూకుమ్మడి డ్రామా
- సామాజిక మాధ్యమాల్లో ముమ్మరంగా ప్రచారం
- సేవ చేసేందుకు వస్తే రాజకీయం చేస్తున్నారని వలంటీర్ల ఆవేదన

అవనిగడ్డ, ఏప్రిల్ 29 : నియోజకవర్గంలో గడిచిన మూడు రోజులుగా వలంటీర్ల రాజీనామా డ్రామాలు కొనసాగుతున్నాయి. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశాలతో.. వారిని ఎలాగైనా ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో అధికార వైసీపీ నేతలు గ్రామాలవారీగా వలంటీర్లపై రాజీనామా ఒత్తిడి తెస్తున్నారు. పార్టీకి అనుకూలంగా ఉండే నలుగురైదురు వలంటీర్ల ద్వారా దొంగ సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ సామాజిక మాధ్యమాల్లో, వాట్సప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, చేయని వారిని పక్కన పెడతామని ద్వితీయ స్థాయి శ్రేణులు బెదిరించటంతో పలువురు వలంటీర్లు రాజీనామా డ్రామాలో పాత్రధారులవుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వైసీపీ ఐ ప్యాక్ టీమ్ పర్యవేక్షిస్తున్నదని, వారి ఒత్తిడితోనే గ్రామస్థాయి నేతలు తమను రాజీనామా చేయాలని బలవంత పెడుతున్నారని పలువురు వలంటీర్లు వాపోతున్నారు. 1వ తేదీలోపు రాజీనామా చేస్తే నెల గౌరవవేతనం పోతుందని వలంటీర్లు చెబుతున్నా జీతం పోతే పార్టీ మీకు ఆ జీతం చెల్లిస్తుందని ఐ ప్యాక్ సభ్యులు గ్రామస్థాయి నేతల ఒత్తిడి తెస్తున్నారని, ప్రజలకు సేవ చేయాలని వలంటీర్లుగా చేరితే ఇలా రాజకీయాల కోసం వాడుకోవటం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సోమవారం సుమారు 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టుగా ప్రచారం జరగ్గా, మండలంలో కేవలం 11మంది రాజీనామాలు మాత్రమే తమకు అందాయని ఎంపీడీవో మరియదేవి తెలిపారు. పంచాయతీ పరిధిలో మరో 20మంది రాజీనామాలు చేసినట్టు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగ్గా, కేవలం ఏడు రాజీనామా పత్రాలు అందాయని అధికారులు చెబుతున్నారు. అధికారులకు అందిన రాజీనామా పత్రాల్లోని సంతకాలు వైసీపీకి అనుకూలంగా ఉన్న వలంటీర్లు మిగిలిన వారి సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ హడావిడి సృష్టిస్తున్నారన్న అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తూ.. తమ వద్దకు వచ్చి రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే లెక్కలోకి తీసుకోవాలని అధికారులు కిందిస్థాయి సిబ్బందికి సూచించినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో వలంటీర్లను ఎన్నికల సమయంలో ఓటర్లను కలిసేలా చేసేందుకు వైసీపీ నేతలు రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.



ర్యాండమైజేషన్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్నికల పరిశీలకులు

విజయవంతంగా మలి దశ ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు


కృష్ణలంక, ఏప్రిల్ 29 : సాధారణ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూరాజ్ పాల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేంద్ర సింగ్ బాలి సమక్షంలో సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. 1874 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,249 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,249 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7413 మంది ఓపీఓలను పారదర్శకంగా ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్టు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ ఆర్వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ పశ్చిమ ఆర్వో ఇ.కిరణ్మయి, నందిగామ ఆర్వో ఎ.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి సోమవారం మైలవరం నియోజకవర్గం జి.కొండూరు, కట్టుబడిపాలెం, కవులూరు, వెలగలేరు, ముత్యాలంపాడు, ఆత్కూరు, చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, గుర్రాజుపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కవులూరు గ్రామస్తులను ప్రోత్సహించారు. ఓటు ప్రాముఖ్యత, ఓటర్ బాధ్యత, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అవగాహన కల్పించారు.

- కూటమి అభ్యర్థుల విజయం ఖాయం
- కొనకళ్ల నారాయణ, రవీంద్ర ధీమా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : వైసీపీ పడవ మునిగిపోతోంది.. కృష్ణాజిల్లాలో ఉమ్మడి అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారు.. అని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మచిలీపట్నం 8వ డివిజన్ లక్ష్మణరావుపురంలో వైసీపీకి చెందిన సంకుల శ్రీనివాస్ బృందం ఆదివారం పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. తొలుత గజమాలలతో కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణలకు టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పేర్ని నానిపై సంకుల శ్రీనివాస్ బృందం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కార్యకర్తలను టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలతో కొల్లు రవీంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు. అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలు కూటమి అభ్యర్థులను ఆదరిస్తున్నారన్నారని, స్వచ్ఛందంగా ర్యాలీలో ఎండను సైతం లెక్క చేయకుండా పాల్గొంటున్నారని చెప్పారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని వేధింపులకు విసిగిపోయిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బండి రామకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, కొనకళ్ల బుల్లయ్య, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆదర్శనగర్‌లో, గాయత్రీ కళ్యాణ మంటపంలో రోల్డుగోల్డు కార్మికులు పెద్ద సంఖ్యలో ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు.



సంకుల నాని బృందంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కొనకళ్ల, రవీంద్ర, రామకృష్ణ

అభివృద్ధిని నాశనం చేసిన వ్యక్తి జగన్

- ఓటు ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి : వసంత కృష్ణ ప్రసాద్



ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 29 : ఏపీ సీఎం జగన్‌కు ఓట్ల యావ తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామనే ఆలోచనే లేదని, ఆయన రివర్స్ పాలనతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు, కేతనకొండ, మూలపాడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ఇక్కడ అన్యాయం చేసింది చాలక గెలిస్తే వైజాగ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తానంటున్న జగన్ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి ఇసుకను పెచ్చు ధరలకు అమ్ముకుందన్నారు. రూ.80ల మద్యం బాటిల్ రూ.300లు పెంచడంతో పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేశాడన్నారు. 15 ఏళ్ల పాటు మద్యం బాండ్ల ద్వారా వచ్చే ఆదాయం బ్యాంకుల్లో తనఖా పెట్టారన్నారు. 2019-24లో జగన్ తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మూతపడే పరిస్థితి తీసుకొచ్చాడన్నారు. అమర్‌రాజా లాంటి పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రం విడిచి పోవాల్సి వచ్చిందన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ రాకపోవడంతో చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి కల్పన లేక రాష్ట్రం నుంచి నిరుద్యోగులు వలస పోయారన్నారు. చింతలపూడికి టీడీపీ ప్రభుత్వం రూ.4,100 కోట్లు ఖర్చుచేస్తే ఐదేళ్లలో వైసీపీ పైసా ఖర్చు చేయకుండా ప్రాజెక్టును తుప్పు పట్టించిందన్నారు. ఓట్ల కోసం అప్పులు చేసి మీట నొక్కితే ప్రగతి ఆగిపోతుందన్నారు. జగన్‌కు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ నేత నూతలపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు, జంపాల సీతారామయ్య, కూటమి నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



వెల్లటూరులో వైసీపీ ఖాళీ

జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో సర్పంచ్ వేల్పూరి సుజానమ్మ, ఆమె భర్త వేల్పూరి మరియన్నలతో పాటు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 20 మందికి పైగా టీడీపీలో చేరారు. వైసీపీ నాయకుడు మలరాజు నారాయణ సైతం టీడీపీలో చేశారు. సోమవారం మైలవరం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది, మాదు ఆంజనేయులుతో పాటు మరో పది మంది వైసీపీని వీడి వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.

స్వర్ణాంధ్ర కావాలంటే చంద్రబాబు రావాలి

- జిల్లా ప్రజలకు నెట్టెం రఘురాం పిలుపు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 29 : నవ్యాంధ్ర అభివృద్ధి.. సర్వజనుల సంక్షేమం.. స్వర్ణాంధ్ర సాకారం చేసుకునేందుకు చంద్రబాబునాయుడుకు ఈ ఎన్నికల్లో అద్భుత విజయం అందించి ముఖ్యమంత్రిగా మళ్లీ రప్పిద్దామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రజలు, ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం తన నివాసంలో పార్టీ ఎన్నికల కో-ఆర్డినేటర్ ఎంవీఆర్ చౌదరి, రాష్ట్ర టీడీపీ గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో 16లక్షల మందికి గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, జగన్ ప్రభుత్వం కేవలం ఎనిమిది లక్షలమందికి ఇచ్చారని, బాబుహయాంలో 4వేల మందికి అంబేడ్కర్ విద్యాదీవెన అందిస్తే, జగన్‌రెడ్డి ఒక్కరికి కూడా అందించలేదని, చంద్రబాబు మూడు బిజినెస్ సమ్మిట్‌లు పెట్టి 5.13లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తే, జగన్‌రెడ్డి కేవలం ఒక్క సమ్మిట్ నిర్వహించి 9150 మందికి ఉద్యోగాలు ఇచ్చాడని, చంద్రబాబు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు డ్వాక్రా మహిళలకు ఇస్తే, జగన్ రూ.3లక్షలకు కుదించారని, అంగన్వాడీలకు చంద్రబాబు రూ.6300ల జీతాలు పెంచితే, జగన్ వెయ్యి పెంచారని చెప్పారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల రుణాలను రూ.4 లక్షల వరకు ఇస్తే.. జగన్ పూర్తిగా ఎత్తేశాడని ఆరోపించారు. మద్యం ధరలు విపరీతంగా పెంచి జె-బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశాడని, రూ.7.25 కోట్ల మంది ఆకలి తీర్చిన అన్నా క్యాంటిన్‌లు ఎత్తేశాడని, ఆదరణ పథకం కింద రూ.4.26 లక్షల మంది చేతి వృత్తుల వారికి అధునాతన పరికరాలు అందిస్తే ఆజాడ లేదన్నారు. టీడీపీ రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి 19.8శాతం కేటాయిస్తే, జగన్‌రెడ్డి కేవలం 15.80శాతం మాత్రమే కేటాయించారని చెప్పారు. నాటి చంద్రబాబు పాలనకు, నేటి జగన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకుని చంద్రబాబును మళ్లీ సీఎంగా రప్పిద్దామని ప్రజలను కోరారు. సమావేశంలో గింజుపల్లి రమేష్, కన్నెబోయిన రామలక్ష్మి, షేక్ అన్వర్, టి.వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

భూములు కైంకర్యం చేసేందుకే.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్



మాట్లాడుతున్న నెట్టెం తదితరులు

రైతుల, ప్రజల భూములను కైంకర్యం చేసేందుకే జగన్ దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చాడని నెట్టెం రఘురాం విమర్శించారు. అధికార యంత్రాంగం దయా దాక్షిణ్యాలపై భూ హక్కులు నిర్ణయించే విధానమని, ఇప్పటికే రెవెన్యూ అధికారులు పెట్టే ఇబ్బందులకు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది కార్యాలయాల వద్ద బలవన్మరణాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. కోర్టుల ద్వారా నిర్ణయాలను సవాల్ చేసే హక్కులను తొలగించారని, రెవెన్యూలో లోపాలను అడ్డం పెట్టుకుని భూములను స్వాహ చేసే స్పష్టమైన అజెండాతో ఈ యాక్టు తెచ్చారని ఆరోపించారు. వైసీపీ ఆరాచకాలను ప్రజలు అంతా గమనించి ఓడించక పోతే పెను ఉపద్రవాన్ని మీదకు తెచ్చుకున్నట్టేనని నెట్టెం హెచ్చరించారు.

లాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రజలకు శాపం.. : వెనిగండ్ల

గుడ్లవల్లేరు : మన స్థలాన్ని జగన్మోహన రెడ్డి, వారి మనుషులు కొట్టేయటానికి చేసిన యాక్టు.. ప్రజలు జాగ్రత్తపడాలి.. జగన్‌కు ఓటేస్తే మీ ఆస్తిని జగన్ కిరాయి మూకలకు అప్పగించినట్టే.. కూటమి ప్రభుత్వం రాగానే భూ చట్టం రద్దు చేస్తాం.. ఆంధ్రా ప్రజల ఆస్తులు కాపాడుతాం.. అని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం వెనిగండ్ల రాము గుడ్లవల్లేరు మండలంలో రోడ్ షో నిర్వహించారు. అంగలూరు, చంద్రాల, విన్నకోట, శేరిదగ్గుమిల్లి, కూరాడ, సేరీ కల్వపూడి గ్రామాల్లో నిర్వహించారు. రాముకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, జగన్ కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ ఐదేళ్లలో ఎపుడూ ప్రజలతో మమేకం కాలేదని, ఇప్పుడు కపట ప్రేమ కురిపిస్తూ మరో సారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారిని తరిమికొట్టాలన్నారు. లేకుంటే రాష్ట్రంలో ఎవరి ఆస్తినీ మిగలనివ్వరని రాము అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, శాయిన పుష్పావతి, కొడాలి రామరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, ఎ.రామ్మోహనరావు, ఈడే మోహన్, మల్లి, దీపక్, నాని, ప్రసాద్, ఆంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో వెనిగండ్ల, రావి

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు

స్థానిక ప్రజావేదికలో సోమవారం పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. 6వ వార్డుకు చెందిన విష్ణుమూర్తుల శేఖర్ ఆధ్వర్యంలో 50మంది వైసీపీ కార్యకర్తలు, 19వ వార్డుకు చెందిన జాజుల మురళీకృష్ణ, పామర్తి రాంబాబు, కుప్పిలి దుర్గాప్రసాద్, మామిడి సింహాచలం తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే కాల్ మనీ ఆట కట్టిస్తా

- మండలి బుద్ధప్రసాద్



వైసీపీ సీనియర్ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుద్ధప్రసాద్

మోపిదేవి : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నియోజకవర్గంలో కొనసాగుతున్న కాల్ మనీ వ్యాపారుల ఆట కట్టిస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం మోపిదేవి మండలంలోని పెదప్రోలులో వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు ఆకుల వెంకట్రామయ్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎడ్లపల్లి శ్రీనివాసరావు సహా 22 మంది జనసేన పార్టీలో చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలని వైసీపీ నుంచి జనసేన, టీడీపీలోకి భారీగా కార్యకర్తలు, నాయకులు చేరుతున్నారన్నారు. ఎన్నికల ముందే వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. మోపిదేవి మండలానికి చెందిన వడ్డీ వ్యాపారి ఆగడాలు భరించలేక రేపల్లెకి చెందిన వృద్ధ కుటుంబం ఆత్మహత్య చేసుకున్న ఘటన కలచివేసిందన్నారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో ఇసుక, మట్టి, ఇతరత్రా మాఫియా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పార్టీలోకి చేరిన వారిని బుద్ధప్రసాద్‌తోపాటు జనసేన నేతలు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండలి రాజేష్, సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, టీడీపీ, జనసేన నేతలు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, ఎంపీటీసీ శ్రావణి, దొప్పలపూడి గంగాభవాని, బాసు శ్రీనివాసరావు, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా బరిలో అభ్యర్థులు

7 అసెంబ్లీ స్థానాలకు 79 పార్లమెంటు స్థానానికి 15

- అసెంబ్లీకి 8 మంది, పార్లమెంటుకు 10 మంది నామినేషన్ల ఉపసంహరణ

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాల లెక్కతేలింది. కృష్ణాజిల్లా ఏడు అసెంబ్లీ స్థానాలకు 79మంది అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 15మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన అనంతరం టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ ఇతరపార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

- మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి 28 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో మూడింటిని అధికారులు తిరస్కరించారు. ఉపసంహరణ గడువు ముగిసేసమయానికి 10మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. పోటీలో 15మంది ఉన్నారు. ప్రధాన పార్టీల తరఫున జనసేనపార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావు, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా గొల్ల కృష్ణ పోటీలో ఉన్నారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించారు. సోమవారం మరో అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నియోజకవర్గంలో 12మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి రమేష్‌బాబు, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో 11మంది పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో 17 నామినేషన్లు దాఖలు చేయగా.. ఐదు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం ఒకరు నామినేషన్ ఉపసంహరించుకున్నారు.. కాంగ్రెస్ అభ్యర్థి ఎలిసెల సుబ్రహ్మణ్యం, వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ ప్రధానపార్టీల తరఫున పోటీలో ఉన్నారు.
- గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి 26 నామినేషన్‌లు దాఖలుకాగా వాటిలో తొమ్మిది నామినేషన్‌లను పరిశీలన సమయంలో అధికారులు తిరస్కరించారు. నామినేషన్‌ల ఉపసంహరణ రోజున ఐదుగురు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. 12మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు, టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా వడ్డాది గోవిందరావు ప్రధానపార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- పెడన నియోజకవర్గంలో 12 నామినేషన్లు దాఖలుకాగా నామినేషన్ల పరిశీలనలో రెండింటిని అధికారులు తిరస్కరించారు. 10మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సోమవారం అభ్యర్థులు ఎవ్వరూ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రమేశ్(రాము), కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా శొంఠి నాగరాజు ప్రధానపార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- గన్నవరం నియోజకవర్గంలో 24 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో పది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం రెండు నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావ్, వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్, సీపీఎం అభ్యర్థిగా కళ్లం వెంకటేశ్వరరావు ప్రధానపార్టీల పోటీలో ఉన్నారు.
- పామర్రు నియోజకవర్గంలో 11 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో మూడు నామినేషన్‌లను అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు అభ్యర్థులు ఎవ్వరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. టీడీపీ అభ్యర్థిగా వర్లకుమార్ రాజా, వైసీపీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా డీవైదాస్ ప్రధానపార్టీల తరఫున పోటీలో ఉన్నారు.
- మచిలీపట్న నియోజకవర్గంలో 17 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో మూడు నామినేషన్‌లను అధికారులు తిరస్కరించారు. సోమవారం అభ్యర్థులు ఎవ్వరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. దీంతో 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా కొల్లు రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా పేర్ని వాకసాయికృష్ణమూర్తి(కిట్టు), కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ మతీన్ ప్రధాన పార్టీల తరఫున పోటీలో ఉన్నారు.

మున్సిపల్ ఆదాయం హాంఫట్ కథనంపై

అధికారులు కదిలారు

- మున్సిపల్ ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ
- ఆర్ఐ కిశోర్ సహా మరికొందరు ఉద్యోగులు
- పంపకాల్లో తేడాతో వెలుగుచూసిన గుట్టు
- రూ. కోటి మేర మున్సిపల్ ఆదాయం మింగినట్టు ప్రాథమిక సమాచారం!

గుడివాడ, ఏప్రిల్ 29 : ఈ నెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మ్యుటేషన్ పేరుతో మింగేశారు' 'మున్సిపల్ ఆదాయానికి గండికొట్టి రూ.50లక్షల హాంఫట్' కథనంతో మున్సిపల్ ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. రాజమండ్రి ఆర్జేడీ ఎస్.వి.వి సత్యనారాయణ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ ఆర్ఐ కిశోర్ అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా వేసినట్టు సమాచారం. ప్రస్తుతం కిశోర్ శెలవుపై వెళ్లినట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు రికార్డులు గల్లంతు చేసారన్న ఆరోపణలున్నాయి. అధికారుల అధికారిక లెక్కల ప్రకారం సుమారు రూ.1కోటి వరకు మున్సిపల్ ఆదాయం పక్కదారి పట్టినట్టు ప్రాథమిక సమాచారం. ఇది మరింత పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఈ కుంభకోణంలో ఆర్ఐ కిశోర్‌తో పాటు మరికొంత మంది హస్తమున్నట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఐ కిషోర్‌ను మున్సిపల్ కమిషనర్ వేరే శాఖకు బదిలీ చేయడంతో నాటి నుంచి కిషోర్ అనధికారికంగా శెలవుపై వెళ్లినట్టు, ఎవరికీ అందుబాటులో లేనట్టు ఉద్యోగవర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఈ వ్యవహారంలో నగదు పంపకం విషయంలో ఉద్యోగుల మధ్య నెలకొన్న గొడవల వలనే కుంభకోణం బయటకు వచ్చిందని, ఎక్కువగా నగదు బదిలీ ఫోన్‌పే ద్వారా ఉద్యోగుల మధ్య జరిగిందని అధికారులు గుర్తించినట్టు సమాచారం.

బీసీల ద్రోహి జగన్: శౌంరి



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం

పెనమలూరు, ఏప్రిల్ 29 : బీసీలకు అమల్లో ఉన్న అనేక పథకాలు రద్దు చేసి, పది ఇచ్చి వంద రూపాయలు లాక్కొంటున్న సైకో జగన్‌రెడ్డిని బీసీలంతా ఏకమై ఓడించాలని టీడీపీ బీసీ నేత శౌంరి శివరాంప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం యనమలకుదురు మార్కండేయ నగర్ కాల్వకట్టపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, బందరు ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని కోరారు. తాడిశెట్టి వీరాస్వామి, చిరావూరి శేషు, యువరాజు, తాడిశెట్టి ప్రసాద్, కొప్పనాతి రమేష్, వాటపల్లి లీలా ప్రసాద్, బలగం కొండ, శేషు, బుంగ బాలస్వామి, శ్రీనివాస్, సయ్యద్ షాహీనా పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా సూపర్‌సిక్స్ పథకాలు

కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 29 : పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించడంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి సూపర్‌సిక్స్ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కోడూరుపాడు, నారాయణపురం, శోభనాద్రిపురంలో బందరు పార్లమెంటు జనసేన అభ్యర్థి బాలశౌరితో పాటు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పూలవర్షం కురిపిస్తూ మంగళహారతులతో మహిళలు, ప్రజలు సాదరస్వాగతం పలికారు. రైతులు ట్రాక్టర్లతో, యువత బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. శోభనాద్రిపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కల నిజం చేయడం టీడీపీ విధానమని, కూటమి అధికారంలోకి రాగానే హౌస్ ఫర్ ఆల్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల మందికి అధికారికంగా ఇళ్ల పట్టాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, వడ్డి శివనాగేశ్వరరావు, దయాల రాజేశ్వరరావు, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, మూల్పూరి సాయికల్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, లంక సురేంద్ర మోహనబెనర్జీ, ఆళ్ల గోపాలకృష్ణ, పుట్టా సురేష్, కలపాల సూర్యనారాయణ, చిన్నాల లక్ష్మీనారాయణ, మండాది రవీంద్ర, కొండపల్లి వెంకన్న, గరికపాటి నాగలక్ష్మి, కఠారి వెంకటకృష్ణ, గరికపాటి నాగబాబు, చందు రంగారావు, వీర్ల బసవేశ్వరరావు, ఆర్నేపల్లి సూరిబాబు, చంద్రమౌళి, చిరంజీవి పాల్గొన్నారు.



కోడూరుపాడులో టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీతోనే ఎస్టీల ఆత్మగౌరవం..

ఎస్టీలను ఆత్మగౌరవంతో జీవించేలా చేసింది టీడీపీయేనని గ్రహించి పార్టీలో చేరడం అభినందనీయమని టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కోడూరుపాడులో సోమవారం నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా టీడీపీలో చేరిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ శ్రేణులకు ఆయన కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన నాగులపల్లి సురేష్, బండి అచ్చియ్య, నాగులపల్లి హరినారాయణ, బండి మాణిక్యాలరావు, బండి అనిల్‌కుమార్, అడిగి దుర్గారావు, నాగులపల్లి శ్రీను, నారాయణపురానికి చెందిన చౌటపల్లి వినోద్‌లకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బందరు పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థి బాలశౌరి, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కొండపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు భరోసా..

పేదల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికల్యాణి తెలిపారు. ఓగిరాల టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధి గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి తదనంతరం వైసీపీ అరాచకపాలనను బేరీజు వేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు పలకాలని కోరారు. కూటమి బందరు ఎంపీ అభ్యర్థి బాలశౌరికి గాజుగ్లాసు గుర్తుపై, కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సజ్జా చలమారావు, మేడికొండ సోంబాబు, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, పుట్టా సురేష్, వడ్డిల్లి లక్ష్మి, చిన్నం శ్రీదేవీ, కలపాల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు..

ఉంగుటూరు : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనను పూర్తిగా విస్మరించిన వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడి, సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా మంచిపాలన అందించే ఎన్డీఏ కూటమికి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామసర్పంచ్ నాగనబోయిన శివనాగబాబు ఆధ్వర్యంలో సుమారు 20మంది వైసీపీ నాయకులు సోమవారం యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవటం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్రప్రజల దీర్ఘకాల ప్రయోజనాలు, అభివృద్ధి-సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని బలంగా విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని యార్లగడ్డ ధీమా వ్యక్తం చేశారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో తులిమిల్లి కిషోర్, రవిబాబు, విజయ్, కళ్యాణ్, లక్ష్మణుడు, సతీష్, తంబి, జయరాజ్, సీతారామయ్య, దేవరపల్లి స్వరూప్ ఉన్నారు.



శోభనాద్రిపురంలో ట్రాక్టర్ల ర్యాలీ

అర్హులందరికీ ఇళ్లస్థలాలు

గన్నవరం : అర్హులైన పేదలందరికి రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. టీడీపీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిస్సా కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తూ యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జాస్తి శ్రీధర్ మాట్లాడు తూ అధికారంలోకి వచ్చిన 9 మాసాలలోపు 15వేల మందికి ఇళ్లస్థలాలు ఇస్తారని తెలిపారు. యార్లగడ్డ వెంకట్రావు అమలు చేయదలుచుకున్న మరో సూపర్ సిక్స్ పథకాలతో నియోజకవర్గ రూపు రేఖలు మారు తాయన్నారు. రాష్ట్రంలోనే నెంబర్‌వన్ నియోజకవర్గంగా ఉండబోతుందన్నారు. టీడీపీ సీనియర్ నేత అరవపల్లి బోస్, పీవీఎస్ఆర్ కృష్ణ, పడమట రంగారావు, మద్దినేని వెంకటే శ్వరరావు, చిమట శ్రీనివాసరావు, మోర్ల నాగబాబు, జాస్తి శేషగిరిరావు, తాళం సురేష్, పలగాని కోటి, మోదుగుమూడి రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



ఓగిరాలలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



గన్నవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రథమ చికిత్సపై అవగాహన

పెనమలూరు,ఏప్రిల్ 29 : వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యూసిటీ బ్లడ్ బ్యాంకు సహకారంతో జరిగిన కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ మదన్‌మోహన్ విద్యార్థులకు ప్రథమ చికిత్స నియమాలు వివరించారు. ముఖ్యంగా పాముకాటు, కరెంటు షాక్, ప్రకృతి వైపరీత్యాలు, గుండెనొప్పి సందర్భాలలో విద్యార్థులు తీసుకోవాల్సిన చర్యలు గూర్చి తెలిపారు. కార్యక్రమాన్ని ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర పర్యవేక్షించారు.

వైసీపీకి బుద్ధిచెప్పాలి: సీపీఎం



ఉంగుటూరులో సీపీఎం ఎన్నికల ప్రచారం

ఉంగుటూరు, ఏప్రిల్ 29 :రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బీజేపీ ప్రభుత్వానికి వంతపాడుతున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని పార్టీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని వేమండ, లంకపల్లి, ముక్కపాడు, మధిరపాడు, కొయ్యగూరపాడు, ఆము దాలపల్లి, పొణుకుమాడు, ఉంగుటూరు, ఎలుకపాడు గ్రామాల్లో మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి గొల్లు కృష్ణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఎం నాయకులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర్ వెంకటేశ్వరరావు, టీవీ రామ్మోహనరావు, పిల్లి రాజారావు, మాగంటి సాంబశివరావు, శ్రీనివాస రావు, సలీం, సుబ్బారెడ్డి, కె.రామరాజు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్

ఉంగుటూరు, ఏప్రిల్ 29 : మండలంలో మే నెల పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రత పింఛన్ల సొమ్ము ఆధార్‌లింక్ అయిన పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు ఒకటోతేదీన జమ చేయటం జరుగుతుందని ఎంపీడీవో మహేశ్వరరావు తెలిపారు. బ్యాంకు ఖాతాలేని పింఛన్‌దారులు, దివ్యాంగులు, మంచంలో లేవలేనిస్థితిలో ఉన్న వారికి అదే రోజు ఉదయం నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దే సొమ్ము పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

జగన్‌ను ఓడించటమే ఎంఎస్పీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంద వేణుబాబు

గన్నవరం, ఏప్రిల్ 29 : అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని చెప్పిన జగన్‌ని ఓడించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మంద వేణుబాబు అన్నారు. గన్నవరంలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ, మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమన్నారు. వర్గీకరణ సాధించుకోవడానికి మాదిగ, మాదిగ ఉపకులాలు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. నాయకులు దొండపాటి శేఖర్, లాము వాసు, కొమరవల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

చేపల చెరువులో మాంసం వ్యర్థాల డంపింగ్

అడ్డుకున్న గ్రామస్థులు



వ్యర్థాల వ్యాన్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 29 : వేలేరు గ్రామం మధ్యలో ఉన్న ఊర చెరువులో చేపల పెంపకానికి మాంసం వ్యర్థాల ను మేతగా వేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వ్యర్థాలు తరలిస్తున్న వ్యానును అడ్డగించారు. గ్రామం మధ్యలో 65 ఎకరాల విస్తీర్ణంలోని చెరువును చేపలసాగుకు పంచాయతీ వేలం ద్వారా అప్పగించారు. చేపల చెరువు పాడుకున్న నిర్వాహకుడు సోమవారం చేపల మేతకు తీసుకువచ్చిన వ్యర్థాల వ్యానును గ్రామస్థులు అడ్డగించారు. దీంతో నిర్వాహకుడు, వ్యాను డ్రైవరు పరారయ్యారు. వ్యానులో ఉన్న మరొక వ్యక్తిని, వ్యానును స్థానికులు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుల పిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గన్నవరంలో ఇద్దరు ఉపసంహరణ

గన్నవరం, ఏప్రిల్ 29 : గన్నవరం నియోజకవర్గంలో ఇద్దరు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. మొత్తం 34 నామినేషన్‌లు దాఖలు కాగా స్క్రూటినీలో 10 తిరస్కరించారు. డబలింగ్‌తో కలిపి 24 ఉంటే ఫైనల్‌గా 14 నామినేషన్‌లు ఆమోదించారు. వాటిల్లో బీఎస్పీ అభ్యర్థి సింహాద్రి రాఘవేంద్రరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైల అజయ్ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. మొత్తం గన్నవరం నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాయకాపురం, ఏప్రిల్ 29 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన సోమవారం పాయకాపురంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇందుపల్లి లాజర్, అతని సోదరుడు మోహనరావు ఉంగుటూరు మండలం మానికొండలో నివాసం ఉంటున్నారు. సోమవారం ద్విచక్రవాహనంపై పాతపాడులోని బంధువుల ఇంటికి పయనమైయ్యారు. కండ్రిక భవానీ బార్‌సెంటర్ వద్దకు వచ్చే సరికి కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లాజర్, మోహనరావు గాయాల పాలయ్యారు. చుట్టు ప్రక్కలవారు చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సైకోను ఓడించడానికి మహిళలు ఏకం కావాలి

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 29 : రాష్ట్రాన్ని ఐదేళ్లుగా పట్టిపీడిస్తున్న సైకో జగన్‌రెడ్డిని ఓడించడానికి రాష్ట్ర మహిళలందరూ ఏకం కావాలని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ మహిళానేత మేడసాని రత్నకుమారి అధ్యక్షతన సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి తెలుగు మహిళల సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు మాట్లాడుతూ, మహిళల సమగ్రాభివృద్ధికి పాటుపడిన పార్టీ టీడీపీ మాత్రమేనని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో యార్లగడ్డ సుచిత్ర, మల్లంపాటి విజయలక్ష్మి, జువ్వా రాంబాబు, ప్యారీ లతీఫ్, వేమూరి స్వరూపారాణి, షకీలా, బూక్యా బిచాలి, నెరుసు రాజ్యలక్ష్మి, పందిపాటి ఇందిర, నాగశ్రీ, పంద్రాజు సుధారాణి, విజయకుమారి, కంచర్ల సుకన్య, బొప్పన నీరజ, సుంకర శ్రీదేవి, శివపార్వతి, కళ్యాణి, శేషుకుమారి పాల్గొన్నారు.



మహిళా నేతల సదస్సులో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

ముదునూరులో

ఉయ్యూరు : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. ముదునూరులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, పార్టీ అధ్యక్షుడు దూసర అజయ్, వైవీబీ రాజేంద్ర ప్రసాద్, వి సత్యనారాయణ, శేఖర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

ముదునూరులో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో కూటమిలో చేరికల పరంపర కొనసాగుతుంది. గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు పల్లపోతు శ్రీనివాసరావు, మొవ్వ జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. చిందా నాగరాజు, బ్రహ్మరాజు, దళపతి ఈశ్వరరాజు, హనుమంతరాజు, బి అంకమరాజు, పిచ్చిరాజు, వెంకటేశ్వర రాజు, సీహెచ్ కోటమరాజు, కృష్ణమూర్తిరాజు, శివకృష్ణ, మురళీకృష్ణ, జస్వంత్, సాయి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు దూసర అజయ్, రవీంద్ర, సాంబశివరావు పాల్గొన్నారు.

● చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభివృద్ధి, అభ్యున్నతి సాధ్యమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కూనపరెడ్డి వాసు అన్నారు. ఉయ్యూరు 9వ వార్డులో సోమవారం సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

● పదవ వార్డులో నగరపంచాయతీ కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటింటా ప్రచారం చేస్తూ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి బాలశౌరి, పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి బోడె ప్రసాద్‌కు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలి

కంకిపాడు : అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ, కుమార్తె వైష్ణవి అన్నారు. పెనమలూరు మండలంలోని గంగూరులో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. వారి వెంట అబ్దుల్ సలీం, ఫరా, ప్యారే లతీఫ్, పల్లె సందీప్, మట్టా సురేష్, కాటూరి కిషోర్, నాగరాజు, పండు బాబు, గౌసు, బాల స్వామి, అక్రం తదితరులు పాల్గొన్నారు. ● కంకిపాడులో నిర్వహించిన టీడీపీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, బండి నాంచారయ్య, వణుకూరు విక్రం, షేక్ బాజి, గుమ్మడి కిరణ్, బొర్రా వెంకట్ పాల్గొన్నారు.● కుందేరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బోడె వెంకట్రామ్, మండపాటి రాజు, షేక్ నాగులమీరావలి, చలసాని వెంకటేశ్వరరావు, రాజు, ఆళ్ల నాని, నాగులు, మీరావలి, శ్రీనివాస రావు, బొమ్మారెడ్డి, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.



ముదునూరులో టీడీపీలో చేరిన కుటుంబాలతో బోడె



గంగూరు ఎన్నికల ప్రచారంలో బోడె హేమ, వైష్ణవి



కంకిపాడులో..

జన  కేతనం

పెనమలూరు పీఠం ఎవరిదో..

- పెడనలో చెల్లని కాసు పెనమలూరులో పోటీ
- స్థానికేతరుడైన జోగి రమేశ్‌ను ఓటర్లు ఆదరిస్తారా?
- ఓడిన మరుసటి రోజు నుంచే జనంలో బోడె
- అవినీతి లేకపోవడం.. నిత్యం జనంతో ఉండటం బోడెకు కలిసి వచ్చే అంశాలు



ఉమ్మడి కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీకి బలమైన నియోజకవర్గాల్లో పెనమలూరు ఒకటి. 2004 ఎన్నికల వరకు కంకిపాడు నియోజకవర్గంలో భాగంగా ఉండేది 2009 నుంచి పెనమలూరు నియోజకవర్గంగా ఏర్పడింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగ్గా ఆరుసార్లు టీడీపీ గెలుపొందిన స్థానం ఇది. గతంలో కంకిపాడు నియోజకవర్గంగా ఉన్న సమయంలో టీడీపీ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించేది. టీడీపీ ఆవిర్భావం తర్వాత కంకిపాడులో ఒకే ఒక్కసారి కాంగ్రెస్ గెలిచింది. పెనమలూరు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీకి ఒక్కొక్కసారి గెలిచాయి. ప్రస్తుతం పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాలు, ఉయ్యూరు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ ఉన్నాయి. సుమారు 2.90 లక్షల ఓటర్లతో కృష్ణా జిల్లాలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉంది.

- విజయవాడ - ఆంధ్రజ్యోతి

వైసీపీలో గ్రూపుల గోల

పెనమలూరు నియోకవర్గం నుంచి గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి గెలుపొందారు. ఆయన ప్రస్తుతం టీడీపీలో ఉన్నారు. నూజివీడు నుంచి పోటీ చేస్తున్నారు. పెనమలూరులో పార్థసారథి వర్గం జోగి రమేశ్‌లో కలిసి అడుగులు వేయలేకపోతోంది. జోగి రమేశ్ ఎక్కువగా తన బంధుమిత్రులను నియోజకవర్గంలో దింపి వారికి ప్రాధాన్యం ఇస్తుండటం స్థానిక నాయకులకు ఇబ్బందికరంగా ఉంది. స్థానికేతరులు తమపై పెత్తనం చేస్తున్నారన్న అభిప్రాయంలో వారు ఉన్నారు. దీంతో గతంలో వైసీపీలో ఉండి సారథి అనుచరులుగా ఉన్న వారిలో అధికశాతం మనస్ఫూర్తిగా జోగికి పనిచేయడం లేదు. ఫలితంగా వైసీపీలో గ్రూపులు ఎక్కువయ్యాయి.

ఓటర్లు ఇలా..



పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,94,928. వారిలో పురుషులు 1,42,349. మహిళలు 1,52,577. మొత్తం ఓటర్లలో బీసీ ఓటర్లు ఎక్కువ శాతం ఉంటారు. ఆ తర్వాత స్థానంలో ఎస్సీలు ఉంటారు. కమ్మ సామాజికవర్గం ఓటర్లు కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. ముస్లిం ఓటర్లు కూడా ఎక్కువగా ఉన్న నియోజకవర్గం ఇది. పెనమలూరు నియోజకవర్గం 2009వ సంవత్సరంలో ఏర్పడింది. అప్పటి వరకు ఇది కంకిపాడు నియోజవకర్గంగా ఉండేది.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
కంకిపాడు నియోజకవర్గం				
1952	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ	ఇ.రత్నాంబ	కాంగ్రెస్
1955	సి.రామకోటయ్య	కేఎల్‌పీ	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1962	సి.రామకోటయ్య	కాంగ్రెస్	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1964(ఉ.ఎ.)	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ	సీఎస్ రావు	కాంగ్రెస్
1967	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్	కేవీఎస్ వరప్రసాదరావు	సీపీఎం
1972	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్	ఎం.లక్ష్మణస్వామి	సీపీఐ
1978	కోనేరు రంగారావు	కాంగ్రెస్	తుమ్మల చౌదరి	జనతా
1983	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	అక్కినేని భాస్కరరావు	కాంగ్రెస్
1985	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	పి.వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
1989	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	వై.నాగేశ్వరరావు	కాంగ్రెస్
1994	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	టీడీపీ	వై.నాగేశ్వరరావు	కాంగ్రెస్
1999	యలమంచిలి నాగేశ్వరరావు	టీడీపీ	దేవినేని నెహ్రూ	కాంగ్రెస్
2004	దేవినేని రాజశేఖర్ నెహ్రూ	కాంగ్రెస్	గద్దె రామ్మోహనరావు	టీడీపీ
పెనమలూరు నియోజకవర్గం				
2009	కొలుసు పార్థసారథి	కాంగ్రెస్	చలసాని వెంకటేశ్వరరావు	టీడీపీ
2014	బోడె ప్రసాద్	టీడీపీ	కుక్కల విద్యాసాగర్	వైసీపీ
2019	కొలుసు పార్థసారథి	వైసీపీ	బోడె ప్రసాద్	టీడీపీ

అక్కడ చెల్లని కాసు.. ఇక్కడ పోటీ..



ప్రస్తుతం టీడీపీ తరఫున బోడె ప్రసాద్ పోటీ చేస్తుండగా వైసీపీ తరఫున జోగి రమేశ్ పోటీలో ఉన్నారు. ఈయన 2014లో మైలవరం నుంచి, 2019లో పెడన నుంచి పోటీ చేశారు. మైలవరంలో ఓటమిపాలు కాగా పెడన నుంచి పోటీ చేసిన సమయంలో వైసీపీ గాలిలో గెలుపు సాధించారు. అయితే పెడన, మైలవరం నియోజకవర్గాల్లో 2019 నుంచి 2024 వరకు జోగి ఆయన అనుచరులు చేసిన అక్రమాలతో ఆ రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు ముఖం చెల్లక ముచ్చటగా మూడో నియోజకవర్గాన్ని ఎంచుకుని పెనమలూరు నుంచి బరిలో దిగారు. స్థానికేతరుడైన.. అవినీతి అక్రమాల మరకలతో నిండిపోయిన జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గ ప్రజలు ఎంత వరకు ఆదరిస్తారో వేచి చూడాలి.

అవినీతి మచ్చలేని నేతగా బోడె



టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు లేకపోవడం.. స్థానికుడు కావడం కలిసి వచ్చే అంశాలు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినా ఆ మరుసటి రోజు నుంచే జనాల్లో ఉంటూ వారి సమస్యలపై తన గళం వినిపిస్తూ వచ్చారు. ఆ సానుభూతితోనే ఆయనకు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఇవ్వదని చెప్పిన మరుక్షణమే నియోజకవర్గ ప్రజలు ఎవరి స్థాయిలో వారు తమ నిరసన తెలిపారు. దీంతో ఓ అడుగు వెనక్కి తగ్గిన టీడీపీ అధిష్ఠానం ఆయనకు పెనమలూరు టికెట్ ఇచ్చింది. బోడె ప్రసాద్‌పై అవినీతి ఆరోపణలు లేవు. మరోవైపు గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి వైసీపీ నాయకులు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం వారంతా జోగి వెంట ఉండటం జోగికి ప్రతికూల అంశం కాగా బోడె ప్రసాద్‌కు కలిసి వచ్చే అంశాలు.



మాటల్లో మహా గౌరవం.. ఆచరణలో అంతులేని వివక్ష!

ఏ సమావేశంలో చూసినా.. ఏ సభలో విన్నా సీఎం వైఎస్ జగన్ మొదలు ఆ పార్టీ నేతలంతా మాటల్లో నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ అంటూ తెగ ప్రేమ కురిపిస్తుంటారు. ఆచరణలో మాత్రం అంతులేని వివక్ష చూపుతారు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం. **పై చిత్రంలో ...** ఎన్నికల ముందు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టణ ప్రథమ పౌరుడు మున్సిపల్ చైర్మన్ బీసీకు చెందిన రంగాపురం రాఘవేంద్ర, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మైనార్టీ నేత మొహిద్దీన్, వేదాద్రి గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్యలకు కుర్చీలు ఇవ్వకుండా నిలబెట్టి అవమానించారు. **దిగువ చిత్రంలో..** ఇటీవల జగ్గయ్యపేటకు వచ్చిన బీసీ నేత ఆర్.కృష్ణయ్య ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కుర్చీ లేక వెనుక నిలబడి ఉన్న మహిళ పూసల కార్పొరేషన్ డైరెకర్ కుమారి. ఈమె బీసీ. బడుగు వర్గాలకు వైసీపీ నేతలు ఇచ్చే విలువ, గౌరవం ఇదన్నమాట. - జగ్గయ్యపేట రూరల్





డప్పు కొట్టు.. ఓటు పట్టు..!

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఎం అభ్యర్థి సీహెచ్ బాబూరావు సోమవారం పుష్ప హోటల్ సెంటర్‌లో డప్పు కొడుతూ ఓటర్లను పలకరిస్తూ ఆకట్టుకున్నారు. - విజయవాడ



సకుటుంబ సపరివార సమేతంగా...

- అభ్యర్థుల తరపున కుటుంబ సభ్యులు మొత్తం ప్రచారంలోనే..
- కుటుంబంలో ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రాంతంలో ఓటర్లను ప్రసన్నం

ఒకప్పుడు ఎన్నికలంటే పోటీచేసే అభ్యర్థి మాత్రమే ప్రచారంలో ఉండేవారు. రానురానూ పరిస్థితులు మారాయి. అభ్యర్థితోపాటు భార్య లేదా తండ్రి వచ్చేవారు. రోజులు మారే కొద్దీ ఓటరును ఆకట్టుకునే పద్ధతి మారింది. అభ్యర్థితోపాటు కుటుంబంలోని అందరూ ప్రచారంలోకి దూకుతున్నారు. అభ్యర్థి ఒక ప్రాంతంలో ఉదయం ఉంటే వారి భార్య, పిల్లలు, సోదరులు, కుమార్తెలు ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో ఉదయం, సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ తమ వారికి ఓటేయమని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.


మొగల్రాజపురం : విజయవాడ పార్లమెంట్ పరిధిలో రెండు ప్రధాన పార్టీలు అయిన తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు కేశినేని శివనాథ్, కేశినేని శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. వీరిలో తెలుగుదేశం అభ్యర్థి కేశినేని శివనాథ్ భార్య జానకీ లక్ష్మి, కుమార్తె స్నిగ్ధ, కుమారుడు వెంకట్, సోదరి కేశినేని శ్రీదేవి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన కుమార్తెలు శ్వేత, హైమా ప్రచారంలో తిరుగుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

అసెంబ్లీ పరిధిలో

విజయవాడ తూర్పు అసెంబ్లీ పరిధిలో తెలుగుదేశం అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు మద్దతుగా ఆయన భార్య అనూరాధ, కుమారులు క్రాంతి, రాజేష్ తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాష్‌కు మద్దతుగా ఆయన భార్య సుధీర ప్రచారం చేస్తున్నారు.

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం అభ్యర్థి బొండా ఉమాకు మద్దతుగా ఆయన భార్య సుజాత, కుమారులు సిద్ధార్థ, రవితేజ ప్రచారం చేస్తుండగా, వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు మద్దతుగా ఆయన భార్య శ్రీవాణి, కుమార్తె సాయి అన్విత, అల్లుడు చక్రవర్తి, సోదరుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరితో పాటు ఆయన కుమారుడు కార్తీక్, కోడలు స్నేహ, కుమార్తె నాగ చాందిని ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో పాటు ఆయన కుమార్తె రేష్మా, కుమారుడు జావెద్ ప్రచారం చేస్తున్నారు.



కేశినేని శివనాథ్ సోదరి కేశినేని శ్రీదేవి ప్రచారం

ఆశలు నీరుగార్చి..

వైసీపీ పాలనలో పూర్తిగా పడకేసిన పట్టిసీమ పనులు



సైడ్‌వాల్ రివిటింగ్, లైనింగ్ పనులు నిలిచిన హనుమాన్‌జంక్షన్ వద్ద పట్టిసీమ కాలువ

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన కాలువ పనులు
- అసంపూర్తిగా మిగిలిన లైనింగ్, స్ట్రక్చర్ల నిర్మాణాలు
- టీడీపీ హయాంలో కృష్ణానదికి 8వేల క్యూసెక్కులు సరఫరా
- వైసీపీ ప్రభుత్వంలో ముక్కీమూలిగీ 6వేల క్యూసెక్కులే సరఫరా

“పట్టిసీమ (పోలవరం కుడికాలువ) ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందించి కృష్ణా జిల్లా రైతుల కష్టాలు తీరుస్తామన్నారు. తాగునీటి సమస్యలేకుండా చేస్తామన్నారు. ఒక్కసారి అధికారమిస్తే అద్భుతాలు చేస్తామని వైసీపీ నేతలు గతంలో హామీ ఇచ్చి గెలిచారు. అధికారంలోకొచ్చిన ఐదేళ్లలో రైతులకు, జనానికి అరచేతిలో వైకుంఠం చూపారు. పట్టిసీమను వట్టిసీమగా మార్చేశారు. పనులు వేగవంతం చేసి గత ప్రభుత్వం 8 వేల క్యూసెక్కుల నీటిని అందిస్తే వైసీపీ ప్రభుత్వం 6వేల క్యూసెక్కులు కూడా ఇవ్వలేదు. కాలువ పెండింగ్ పనులను గాలికి వదిలేసింది. కాలువ లైనింగ్, స్ట్రక్చర్ల పనులు ఆపేసింది. దీనికి తోడు పోలవరం ఎత్తిపోతల పథకం 24 పంపులను వినియోగించకపోవడంతో కృష్ణాడెల్టాకు ఆశించినంత నీరు ఇవ్వకుండా పంటలను ఎండబెట్టింది. రైతుల ఆశలను నీరుగార్చింది.

హనుమాన్‌జంక్షన్ : గోదావరి మిగులు జలాలను కృష్ణా నదికి తరలించి కృష్ణాడెల్టాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులకు సాగునీటిని అందించే లక్ష్యంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం పనులు 2005లో ప్రారంభం అయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి విజయవాడ కృష్ణా నది వరకు 178 కి.మీ పొడవునా పట్టిసీమ (పోలవరం కుడికాలువ) సాగుతుంది. రూ.1660 కోట్లుతో సాగే ఈ కాలువపై అండర్ టన్నెల్స్, ఇతరేతర నిర్మాణాలు 255 వరకు నిర్మించాల్సి ఉంటే 175 పూర్తయ్యాయి. 55 నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కృష్ణా డెల్టా కింద దాదాపు 13 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉంది. దీనికి 10 వేల క్యూసెక్కుల నీరు అవసరం ఏర్పడుతుంది. పట్టిసీమ 24 పంపులు ద్వారా విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సాగు, తాగునీటి అవసరాలకు 8 వేల క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం ఆ పంపులను కూడా సరిగ్గా నిర్వహించలేదు. కేవలం 16 పంపులను మాత్రమే వినియోగించింది. దీంతో బ్యారేజీకి 5 నుంచి 6వేల క్యూసెక్కుల నీరు చేరడమే కష్టమైంది. ఫలితంగా ఈ ఏడాది అవనిగడ్డ ప్రాంతంలో వరికి సాగు నీరు అందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది.

టీడీపీ పాలనలో ఇలా..

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టిసీమ కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కృష్ణాడెల్టాకు నీటి కొరతను తీర్చడానికి 2015 ఆగస్టులో ప్రయోగాత్మకంగా 2వేల క్యూసెక్కుల నీటిని పట్టి సీమ ఎత్తిపోతల ద్వారా విడుదల చేశారు. లైనింగ్, స్ట్రక్చర్ల పనులు పూర్తి కానప్పటికీ కృష్ణా డెల్టాలోని నీటి సమస్యను పరిష్కరించడానికి పట్టిసీమ నీటిని విడుదల చేశారు. తొలిసారిగా 2016 ఖరీఫ్ సీజన్‌లో 8వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి రెగ్యులర్‌గా నీటిని విడుదల చేస్తూ వస్తున్నారు. కాలువలో ఉన్న పెండింగ్ పనులు ఖరీఫ్ సీజన్ పూర్తికాగానే తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతూ వచ్చేది.

వైసీపీ పాలనలో ఇలా..

జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి పట్టిసీమను నిర్లక్ష్యం చేసింది. గడిచిన ఐదేళ్లలో ఏ ఒక్క పని చేపట్టలేదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాలువకు అడ్డంగా సాగిన వాగులు వద్ద నిర్మించాల్సిన సూపర్ పాస్‌లు, అండర్ టన్నెల్స్ పనులు ఆగిపోయాయి. కృష్ణా జిల్లాలో హనుమాన్‌జంక్షన్ సమీపంలోని మర్రిబంధం నుంచి విజయవాడ వరకు 5,6,7 రీచ్ (దశలు)గా సాగాయి. 5వ రీచ్‌లో 2.5 కి.మీ పొడవున లైనింగ్ చేయాల్సి ఉంది. 6, 7 రీచ్‌ల్లో అక్కడక్కడా లైనింగ్, పలు స్ట్రక్చర్లు నిర్మాణం పనులు మిగిలాయి. ప్రధాన రహదారులపై నిర్మించిన వంతెనల వద్ద లైనింగ్, వంతెన సపోర్టు కాంక్రీట్ పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. బహుళ ప్రయోజనాలు అందించే పట్టిసీమ కాలువ పెండింగ్ పనులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు.



వేలేరు వద్ద అసంపూర్తిగా మిగిలిన సూపర్ పాస్



అవనిగడ్డలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

రాజీనామా రాజకీయం!

- వలంటీర్లపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న ఐప్యాక్, అధికారపార్టీ నేతలు?
- వైసీపీ సేవలో తరించే కొందరి సంతకాలతో మూకుమ్మడి డ్రామా
- సామాజిక మాధ్యమాల్లో ముమ్మరంగా ప్రచారం
- సేవ చేసేందుకు వస్తే రాజకీయం చేస్తున్నారని వలంటీర్ల ఆవేదన

అవనిగడ్డ, ఏప్రిల్ 29 : నియోజకవర్గంలో గడిచిన మూడు రోజులుగా వలంటీర్ల రాజీనామా డ్రామాలు కొనసాగుతున్నాయి. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశాలతో.. వారిని ఎలాగైనా ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో అధికార వైసీపీ నేతలు గ్రామాలవారీగా వలంటీర్లపై రాజీనామా ఒత్తిడి తెస్తున్నారు. పార్టీకి అనుకూలంగా ఉండే నలుగురైదురు వలంటీర్ల ద్వారా దొంగ సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ సామాజిక మాధ్యమాల్లో, వాట్సప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, చేయని వారిని పక్కన పెడతామని ద్వితీయ స్థాయి శ్రేణులు బెదిరించటంతో పలువురు వలంటీర్లు రాజీనామా డ్రామాలో పాత్రధారులవుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వైసీపీ ఐ ప్యాక్ టీమ్ పర్యవేక్షిస్తున్నదని, వారి ఒత్తిడితోనే గ్రామస్థాయి నేతలు తమను రాజీనామా చేయాలని బలవంత పెడుతున్నారని పలువురు వలంటీర్లు వాపోతున్నారు. 1వ తేదీలోపు రాజీనామా చేస్తే నెల గౌరవవేతనం పోతుందని వలంటీర్లు చెబుతున్నా జీతం పోతే పార్టీ మీకు ఆ జీతం చెల్లిస్తుందని ఐ ప్యాక్ సభ్యులు గ్రామస్థాయి నేతల ఒత్తిడి తెస్తున్నారని, ప్రజలకు సేవ చేయాలని వలంటీర్లుగా చేరితే ఇలా రాజకీయాల కోసం వాడుకోవటం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సోమవారం సుమారు 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టుగా ప్రచారం జరగ్గా, మండలంలో కేవలం 11మంది రాజీనామాలు మాత్రమే తమకు అందాయని ఎంపీడీవో మరియదేవి తెలిపారు. పంచాయతీ పరిధిలో మరో 20మంది రాజీనామాలు చేసినట్టు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగ్గా, కేవలం ఏడు రాజీనామా పత్రాలు అందాయని అధికారులు చెబుతున్నారు. అధికారులకు అందిన రాజీనామా పత్రాల్లోని సంతకాలు వైసీపీకి అనుకూలంగా ఉన్న వలంటీర్లు మిగిలిన వారి సంతకాలు పెట్టి మూకుమ్మడి రాజీనామాలు అంటూ హడావిడి సృష్టిస్తున్నారన్న అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తూ.. తమ వద్దకు వచ్చి రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే లెక్కలోకి తీసుకోవాలని అధికారులు కిందిస్థాయి సిబ్బందికి సూచించినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో వలంటీర్లను ఎన్నికల సమయంలో ఓటర్లను కలిసేలా చేసేందుకు వైసీపీ నేతలు రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.



ర్యాండమైజేషన్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్నికల పరిశీలకులు

విజయవంతంగా మలి దశ ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 29 : సాధారణ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూరాజ్ పాల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేంద్ర సింగ్ బాలి సమక్షంలో సంబంధిత అధికారులతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. 1874 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,249 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,249 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7413 మంది ఓపీఓలను పారదర్శకంగా ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్టు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ ఆర్వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ పశ్చిమ ఆర్వో ఇ.కిరణ్మయి, నందిగామ ఆర్వో ఎ.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి సోమవారం మైలవరం నియోజకవర్గం జి.కొండూరు, కట్టుబడిపాలెం, కవులూరు, వెలగలేరు, ముత్యాలంపాడు, ఆత్కూరు, చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, గుర్రాజుపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కవులూరు గ్రామస్తులను ప్రోత్సహించారు. ఓటు ప్రాముఖ్యత, ఓటర్ బాధ్యత, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అవగాహన కల్పించారు.

వైసీపీ మునుగుతున్న నావ!

- కూటమి అభ్యర్థుల విజయం ఖాయం
- కొనకళ్ల నారాయణ, రవీంద్ర ధీమా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : వైసీపీ పడవ మునిగిపోతోంది.. కృష్ణాజిల్లాలో ఉమ్మడి అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారు.. అని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మచిలీపట్నం 8వ డివిజన్ లక్ష్మణరావుపురంలో వైసీపీకి చెందిన సంకుల శ్రీనివాస్ బృందం ఆదివారం పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. తొలుత గజమాలలతో కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణలకు టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పేర్ని నానిపై సంకుల శ్రీనివాస్ బృందం తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కార్యకర్తలను టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలతో కొల్లు రవీంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు. అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలు కూటమి అభ్యర్థులను ఆదరిస్తున్నారన్నారని, స్వచ్ఛందంగా ర్యాలీలో ఎండను సైతం లెక్క చేయకుండా పాల్గొంటున్నారని చెప్పారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని వేధింపులకు విసిగిపోయిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బండి రామకృష్ణ, బూరగడ్డ వేదవ్యాస్, కొనకళ్ల బుల్లయ్య, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆదర్శనగర్‌లో, గాయత్రీ కళ్యాణ మంటపంలో రోల్డుగోల్డు కార్మికులు పెద్ద సంఖ్యలో ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు.



సంకుల నాని బృందంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కొనకళ్ల, రవీంద్ర, రామకృష్ణ

అభివృద్ధిని నాశనం చేసిన వ్యక్తి జగన్

- ఓటు ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలి : వసంత కృష్ణ ప్రసాద్



ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 29 : ఏపీ సీఎం జగన్‌కు ఓట్ల యావ తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామనే ఆలోచనే లేదని, ఆయన రివర్స్ పాలనతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు, కేతనకొండ, మూలపాడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ఇక్కడ అన్యాయం చేసింది చాలక గెలిస్తే వైజాగ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తానంటున్న జగన్ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి ఇసుకను పెచ్చు ధరలకు అమ్ముకుందన్నారు. రూ.80ల మద్యం బాటిల్ రూ.300లు పెంచడంతో పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేశాడన్నారు. 15 ఏళ్ల పాటు మద్యం బాండ్ల ద్వారా వచ్చే ఆదాయం బ్యాంకుల్లో తనఖా పెట్టారన్నారు. 2019-24లో జగన్ తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మూతపడే పరిస్థితి తీసుకొచ్చాడన్నారు. అమర్‌రాజా లాంటి పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రం విడిచి పోవాల్సి వచ్చిందన్నారు. కొత్తగా ఒక్క పరిశ్రమ రాకపోవడంతో చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి కల్పన లేక రాష్ట్రం నుంచి నిరుద్యోగులు వలస పోయారన్నారు. చింతలపూడికి టీడీపీ ప్రభుత్వం రూ.4,100 కోట్లు ఖర్చుచేస్తే ఐదేళ్లలో వైసీపీ పైసా ఖర్చు చేయకుండా ప్రాజెక్టును తుప్పు పట్టించిందన్నారు. ఓట్ల కోసం అప్పులు చేసి మీట నొక్కితే ప్రగతి ఆగిపోతుందన్నారు. జగన్‌కు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ నేత నూతలపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు, జంపాల సీతారామయ్య, కూటమి నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



వెల్లటూరులో వైసీపీ ఖాళీ

జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో సర్పంచ్ వేల్పూరి సుజానమ్మ, ఆమె భర్త వేల్పూరి మరియన్నలతో పాటు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 20 మందికి పైగా టీడీపీలో చేరారు. వైసీపీ నాయకుడు మలరాజు నారాయణ సైతం టీడీపీలో చేశారు. సోమవారం మైలవరం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది, మాదు ఆంజనేయులుతో పాటు మరో పది మంది వైసీపీని వీడి వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.

స్వర్ణాంధ్ర కావాలంటే చంద్రబాబు రావాలి

- జిల్లా ప్రజలకు నెట్టెం రఘురాం పిలుపు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 29 : నవ్యాంధ్ర అభివృద్ధి.. సర్వజనుల సంక్షేమం.. స్వర్ణాంధ్ర సాకారం చేసుకునేందుకు చంద్రబాబునాయుడుకు ఈ ఎన్నికల్లో అద్భుత విజయం అందించి ముఖ్యమంత్రిగా మళ్లీ రప్పిద్దామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రజలు, ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం తన నివాసంలో పార్టీ ఎన్నికల కో-ఆర్డినేటర్ ఎంవీఆర్ చౌదరి, రాష్ట్ర టీడీపీ గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో 16లక్షల మందికి గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, జగన్ ప్రభుత్వం కేవలం ఎనిమిది లక్షలమందికి ఇచ్చారని, బాబుహయాంలో 4వేల మందికి అంబేడ్కర్ విద్యాదీవెన అందిస్తే, జగన్‌రెడ్డి ఒక్కరికి కూడా అందించలేదని, చంద్రబాబు మూడు బిజినెస్ సమ్మిట్‌లు పెట్టి 5.13లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తే, జగన్‌రెడ్డి కేవలం ఒక్క సమ్మిట్ నిర్వహించి 9150 మందికి ఉద్యోగాలు ఇచ్చాడని, చంద్రబాబు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు డ్వాక్రా మహిళలకు ఇస్తే, జగన్ రూ.3లక్షలకు కుదించారని, అంగన్వాడీలకు చంద్రబాబు రూ.6300ల జీతాలు పెంచితే, జగన్ వెయ్యి పెంచారని చెప్పారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల రుణాలను రూ.4 లక్షల వరకు ఇస్తే.. జగన్ పూర్తిగా ఎత్తేశాడని ఆరోపించారు. మద్యం ధరలు విపరీతంగా పెంచి జె-బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశాడని, రూ.7.25 కోట్ల మంది ఆకలి తీర్చిన అన్నా క్యాంటీన్‌లు ఎత్తేశాడని, ఆదరణ పథకం కింద రూ.4.26 లక్షల మంది చేతి వృత్తుల వారికి అధునాతన పరికరాలు అందిస్తే ఆజాడ లేదన్నారు. టీడీపీ రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి 19.8శాతం కేటాయిస్తే, జగన్‌రెడ్డి కేవలం 15.80శాతం మాత్రమే కేటాయించారని చెప్పారు. నాటి చంద్రబాబు పాలనకు, నేటి జగన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకుని చంద్రబాబును మళ్లీ సీఎంగా రప్పిద్దామని ప్రజలను కోరారు. సమావేశంలో గింజుపల్లి రమేష్, కన్నెబోయిన రామలక్ష్మి, షేక్ అన్వర్, టి.వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

భూములు కైంకర్యం చేసేందుకే.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్



మాట్లాడుతున్న నెట్టెం తదితరులు

రైతుల, ప్రజల భూములను కైంకర్యం చేసేందుకే జగన్ దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చాడని నెట్టెం రఘురాం విమర్శించారు. అధికార యంత్రాంగం దయా దాక్షిణ్యాలపై భూ హక్కులు నిర్ణయించే విధానమని, ఇప్పటి కే రెవెన్యూ అధికారులు పెట్టే ఇబ్బందులకు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది కార్యాలయాల వద్ద బలవన్మరణాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. కోర్టుల ద్వారా నిర్ణయాలను సవాల్ చేసే హక్కులను తొలగించారని, రెవెన్యూలో లోపాలను అడ్డం పెట్టుకుని భూములను స్వాహ చేసే స్పష్టమైన అజెండాతో ఈ యాక్టు తెచ్చారని ఆరోపించారు. వైసీపీ ఆరాచకాలను ప్రజలు అంతా గమనించి ఓడించక పోతే పెను ఉపద్రవాన్ని మీదకు తెచ్చుకున్నట్టేనని నెట్టెం హెచ్చరించారు.

లాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రజలకు శాపం.. : వెనిగండ్ల

గుడ్లవల్లేరు : మన స్థలాన్ని జగన్మోహన రెడ్డి, వారి మనుషులు కొట్టేయటానికి చేసిన యాక్టు.. ప్రజలు జాగర్తపడాలి.. జగన్‌కు ఓటేస్తే మీ ఆస్తిని జగన్ కిరాయి మూకలకు అప్పగించినట్టే.. కూటమి ప్రభుత్వం రాగానే భూ చట్టం రద్దు చేస్తాం.. ఆంధ్రా ప్రజల ఆస్తులు కాపాడుతాం.. అని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం వెనిగండ్ల రాము గుడ్లవల్లేరు మండలంలో రోడ్ షో నిర్వహించారు. అంగలూరు, చంద్రాల, విన్నకోట, శేరిదగ్గుమిల్లి, కూరాడ, సేరీ కల్వపూడి గ్రామాల్లో నిర్వహించారు. రాముకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, జగన్ కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ ఐదేళ్లలో ఎపుడూ ప్రజలతో మమేకం కాలేదని, ఇప్పుడు కపట ప్రేమ కురిపిస్తూ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వారిని తరిమికొట్టాలన్నారు. లేకుంటే రాష్ట్రంలో ఎవరి ఆస్తినీ మిగలనివ్వరని రాము అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, శాయిన పుష్పావతి, కొడాలి రామరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, ఎ.రామ్మోహనరావు, ఈడే మోహన్, మల్లి, దీపక్, నాని, ప్రసాద్, ఆంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో వెనిగండ్ల, రావి

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు

స్థానిక ప్రజావేదికలో సోమవారం పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. 6వ వార్డుకు చెందిన విష్ణుమూర్తుల శేఖర్ ఆధ్వర్యంలో 50మంది వైసీపీ కార్యకర్తలు, 19వ వార్డుకు చెందిన జాజుల మురళీకృష్ణ, పామర్తి రాంబాబు, కుప్పిలి దుర్గాప్రసాద్, మామిడి సింహాచలం తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే కాల్ మనీ ఆట కట్టిస్తా

- మండలి బుద్ధప్రసాద్



వైసీపీ సీనియర్ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుద్ధప్రసాద్

మోపిదేవి : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నియోజకవర్గంలో కొనసాగుతున్న కాల్ మనీ వ్యాపారుల ఆట కట్టిస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం మోపిదేవి మండలంలోని పెదప్రోలులో వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు ఆకుల వెంకట్రామయ్య, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎడ్లపల్లి శ్రీనివాసరావు సహా 22 మంది జనసేన పార్టీలో చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొందాలని వైసీపీ నుంచి జనసేన, టీడీపీలోకి భారీగా కార్యకర్తలు, నాయకులు చేరుతున్నారన్నారు. ఎన్నికల ముందే వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. మోపిదేవి మండలానికి చెందిన వడ్డీ వ్యాపారి ఆగడాలు భరించలేక రేపల్లెకి చెందిన వృద్ధ కుటుంబం ఆత్మహత్య చేసుకున్న ఘటన కలచివేసిందన్నారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో ఇసుక, మట్టి, ఇతరత్రా మాఫియా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పార్టీలోకి చేరిన వారిని బుద్ధప్రసాద్‌తోపాటు జనసేన నేతలు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండలి రాజేష్, సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, టీడీపీ, జనసేన నేతలు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, ఎంపీటీసీ శ్రావణి, దొప్పలపూడి గంగాభవాని, బాసు శ్రీనివాసరావు, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా బరిలో అభ్యర్థులు

7 అసెంబ్లీ స్థానాలకు 79 పార్లమెంటు స్థానానికి 15

- అసెంబ్లీకి 8 మంది, పార్లమెంటుకు 10 మంది నామినేషన్ల ఉపసంహరణ

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాల లెక్కతేలింది. కృష్ణాజిల్లా ఏడు అసెంబ్లీ స్థానాలకు 79మంది అభ్యర్థులు, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 15మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన అనంతరం టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ ఇతరపార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

- మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి 28 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో మూడింటిని అధికారులు తిరస్కరించారు. ఉపసంహరణ గడువు ముగిసేసమయానికి 10మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. పోటీలో 15మంది ఉన్నారు. ప్రధాన పార్టీల తరఫున జనసేనపార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావు, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా గోళ్ల కృష్ణ పోటీలో ఉన్నారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించారు. సోమవారం మరో అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నియోజకవర్గంలో 12మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి రమేష్‌బాబు, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో 11మంది పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో 17 నామినేషన్లు దాఖలు చేయగా.. ఐదు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం ఒకరు నామినేషన్ ఉపసంహరించుకున్నారు.. కాంగ్రెస్ అభ్యర్థి ఎలిసెల సుబ్రహ్మణ్యం, వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ ప్రధానపార్టీల తరపున పోటీలో ఉన్నారు.
- గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి 26 నామినేషన్‌లు దాఖలుకాగా వాటిలో తొమ్మిది నామినేషన్‌లను పరిశీలన సమయంలో అధికారులు తిరస్కరించారు. నామినేషన్‌ల ఉపసంహరణ రోజున ఐదుగురు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. 12మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు, టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా వడ్డాది గోవిందరావు ప్రధానపార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- పెడన నియోజకవర్గంలో 12 నామినేషన్లు దాఖలుకాగా నామినేషన్ల పరిశీలనలో రెండింటిని అధికారులు తిరస్కరించారు. 10మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సోమవారం అభ్యర్థులు ఎవ్వరూ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రమేశ్(రాము), కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా శొంఠి నాగరాజు ప్రధానపార్టీల అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.
- గన్నవరం నియోజకవర్గంలో 24 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో పది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం రెండు నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావ్, వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్, సీపీఎం అభ్యర్థిగా కళ్లం వెంకటేశ్వరరావు ప్రధానపార్టీల పోటీలో ఉన్నారు.
- పామర్రు నియోజకవర్గంలో 11 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో మూడు నామినేషన్‌లను అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు అభ్యర్థులు ఎవ్వరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. టీడీపీ అభ్యర్థిగా వర్లకుమార్ రాజా, వైసీపీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా డీవైదాస్ ప్రధానపార్టీల తరపున పోటీలో ఉన్నారు.
- మచిలీపట్న నియోజకవర్గంలో 17 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో మూడు నామినేషన్‌లను అధికారులు తిరస్కరించారు. సోమవారం అభ్యర్థులు ఎవ్వరూ తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోలేదు. దీంతో 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా కొల్లు రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా పేర్ని వాకసాయికృష్ణమూర్తి(కిట్టు), కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ మతీన్ ప్రధాన పార్టీల తరపున పోటీలో ఉన్నారు.

మున్సిపల్ ఆదాయం హాంఫట్ కథనంపై

అధికారులు కదిలారు

- మున్సిపల్ ఆర్జేడీ ఆకస్మిక తనిఖీ
- ఆర్ఐ కిశోర్ సహా మరికొందరు ఉద్యోగులు
- పంపకాల్లో తేడాతో వెలుగుచూసిన గుట్టు
- రూ. కోటి మేర మున్సిపల్ ఆదాయం మింగినట్టు ప్రాథమిక సమాచారం!

గుడివాడ, ఏప్రిల్ 29 : ఈ నెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మ్యుటేషన్ పేరుతో మింగేశారు' 'మున్సిపల్ ఆదాయానికి గండికొట్టి రూ.50లక్షల హాంఫట్' కథనంతో మున్సిపల్ ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. రాజమండ్రి ఆర్జేడీ ఎన్.వి.వి సత్యనారాయణ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ ఆర్ఐ కిశోర్ అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా వేసినట్టు సమాచారం. ప్రస్తుతం కిశోర్ శెలవుపై వెళ్లినట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు రికార్డులు గల్లంతు చేసారన్న ఆరోపణలున్నాయి. అధికారుల అధికారిక లెక్కల ప్రకారం సుమారు రూ.1కోటి వరకు మున్సిపల్ ఆదాయం పక్కదారి పట్టినట్టు ప్రాథమిక సమాచారం. ఇది మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంలో ఆర్ఐ కిశోర్‌తో పాటు మరికొంత మంది హస్తమున్నట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఐ కిషోర్‌ను మున్సిపల్ కమిషనర్ వేరే శాఖకు బదిలీ చేయడంతో నాటి నుంచి కిషోర్ అనధికారికంగా శెలవుపై వెళ్లినట్టు, ఎవరికీ అందుబాటులో లేనట్టు ఉద్యోగవర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఈ వ్యవహారంలో నగదు పంపకం విషయంలో ఉద్యోగుల మధ్య నెలకొన్న గొడవల వలనే కుంభకోణం బయటకు వచ్చిందని, ఎక్కువగా నగదు బదిలీ ఫోన్‌పే ద్వారా ఉద్యోగుల మధ్య జరిగిందని అధికారులు గుర్తించినట్టు సమాచారం.



పాగోలు ప్రముఖుడు రామబ్రహ్మం మృతి, పలువురి సంతాపం



కె.రామబ్రహ్మం(ఫైల్)

చల్లపల్లి, ఏప్రిల్ 29 : విశ్రాంత బిల్ కలెక్టర్, పాగోలు గ్రామ ప్రముఖుడు కంఠంనేని రామబ్రహ్మం (75) గుండెపోటుతో సోమవారం స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పదవీ విరమణ అనంతరం రామబ్రహం సామాజిక సేవ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌ను ప్రజోపయోగంగా ఖర్చు చేస్తూ గుర్తింపు పొందారు. రామబ్రహ్మం మృతిపట్ల పలువురు ప్రముఖులు, గ్రామ ప్రజానీకం, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



కొల్లు రవీంద్రకు హారతులిస్తున్న మహిళలు



చినపాండ్రాకలో ప్రచారం చేస్తున్న కాగిత కృష్ణప్రసాద్



కురుమద్దాలిలో ఓట్లు అభ్యర్థిస్తున్న కుమార్ రాజా



చల్లపల్లిలో ప్రచారం చేస్తున్న బుద్ధప్రసాద్ కుమార్తె కృష్ణప్రభ

అరాచక వైసీపీని తరిమికొట్టండి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : అరాచక వైసీపీని తరిమికొట్టాలని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి జలాల్‌పేటలో పర్యటించారు. కొల్లు రవీంద్రకు అడుగడుగునా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులిచ్చారు. యువకులు కేరింతలు కొడుతూ ప్రచార రథం వెంట నడిచారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జనసేన నాయకుడు గడ్డం రాజు, బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, గజేంద్ర, అయోధ్యరామయ్య పాల్గొన్నారు.

కాగిత కృష్ణప్రసాద్ జోష్

కృత్తివెన్ను : పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ మండల పరిధిలో సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ఇంతేరు గ్రామం నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీ చినపాండ్రాక, చెరుకుమిల్లి, యండపల్లి, గాంధీనగరం మీదుగా అడ్డపర్ర, సంగమూడి, కృత్తివెన్ను, శీతనపల్లి, కొమాళ్ళపూడి, నీలిపూడి, మునిపెడ గ్రామాల వరకు సాగింది. ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు బలపరిచిన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని, ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు జనసేన బందరు పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బలశౌరి తనయుడు అనుదీప్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సురేష్ పాల్గొని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

వర్ల కుమార్‌రాజా విస్తృత ప్రచారం

పామర్రు : పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా సోమవారం కనుమూరు, కురుమద్దాలి, ఉరుటూరు, పసుమర్రు గ్రామాల్లో బందరు పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అరుణ్‌శౌరితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడిశెట్టి నరేష్, గుండు శ్రీనివాసరావు, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, వల్లూరిపల్లి గణేష్, గొట్టిపాటి లక్ష్మీదాస్, మండపాక శంకర్‌బాబు, దగ్గుపాటి ఫణీంద్ర నాథ్, కొసరాజు వెంకటేశ్వరరావు, లక్ష్మీపతి, కాకి నాగేంద్రం, మండవ బాలకృష్ణ, లాజరస్ తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** సూపర్ సిక్స్ పథకాలు ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అన్నారు. వెంట్రప్రగడ గ్రామంలో సోమవారం వర్ల కుమార్ రాజాని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గొరిపర్తి రవికుమార్, కూచిపూడి సుబ్బయ్య, చలసాని చక్రపాణి, షేక్ బాబు, మాయర విజయబాబు, జాజుల ప్రసాద్, మండల పార్టీ నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** పామర్రు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా గెలుపు కోరుతూ భార్య వర్ల విశ్రమ సోమవారం రాత్రి తోట్లవల్లూరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, లుక్కా రేణుకారావు, రామకృష్ణ, గొరిపర్తి గోపయ్య, ఈడ్పుగంటి లక్ష్మీశ్రీ పాల్గొన్నారు.



ఘంటసాలలో ప్రచారం చేస్తున్న ఎన్‌ఆర్‌ఐలు రంగనాథ్‌బాబు, మూల్పూరి

రాష్ట్రాభివృద్ధికి కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరం

● ఎన్‌ఆర్‌ఐలు గొర్రెపాటి రంగనాథ్‌బాబు, మూల్పూరి వెంకట్రావు

ఘంటసాల : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో పయనించాలంటే కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరమని ఎన్‌ఆర్‌ఐలు గొర్రెపాటి రంగనాథ్ బాబు, మూల్పూరి వెంకట్రావు పేర్కొన్నారు. ఎన్డీఏ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఘంటసాల గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని, అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించే చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి సురేష్, బండి పరాత్పరరావు, యోహాను, గొర్రెపాటి శ్రీనివాస్, మూల్పూరి భీక్షం, దిరిశం సుబ్బారావు, దిరిశం సుధీర్, యార్లగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌ను గెలిపించండి

అవనిగడ్డ : మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను గెలిపించాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం విజ్ఞప్తి చేసింది. సోమవారం సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణచందు వేర్వేరు పత్రికా ప్రకటనల్లో బుద్ధప్రసాద్‌కు మద్దతు తెలిపారు. దివి ప్రాంత అభివృద్ధి కోసం, తెలుగు భాషా వికాసం కోసం కృషి చేసిన బుద్ధప్రసాద్‌లాంటి వ్యక్తిని అసెంబ్లీకి పంపటం ద్వారా తెలుగు భాషా వికాసానికి



ఉల్లిపాలెం గ్రామంలో ప్రచారం చేస్తున్న బుద్ధప్రసాద్ కోడలు సాయిసుప్రియ

కృషి చేసే వారికి ప్రోత్సాహ మిచ్చినట్లు అవుతుందన్నారు. **నాగాయలంక :** నంగేగడ్డలో మండలి బుద్ధప్రసాద్ తనయ అవనిజ స్థానిక నేతలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలి ఉదయభాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, బావిరెడ్డి నాగ శ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నబ్బినేని బజారులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, తలశిల వెంకట నరసింహారావు, ఆలూరు శ్రీనివాసరావు, బొడ్డు విజయ్, తలశిల రామకృష్ణ చౌదరి, మాదివాడ అర్జునరావు, మేడికొండ విజయ్, తలశిల శివరామకృష్ణ, చిట్టా శ్రీనివాసరావు, బండ్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** ఉల్లిపాలెం గ్రామంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మండలి బుద్ధప్రసాద్ కోడలు మండలి సాయి సుప్రియ సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, పూతబోయిన కరుణకుమార్, పూతబోయిన శ్రీనివాసరావు, సుంకర లక్ష్మీ, బొలిశెట్టి విఠల్ రావు, మాచర్ల భీమయ్య, పిల్లి మల్లికార్జునరావు, కోట రాంబాబు, మద్దూరి కాంతారావు, వేములపల్లి రాజేష్ పాల్గొన్నారు. **చల్లపల్లి :** వల్లభనేని బాలసౌరి, మండలి బుద్ధప్రసాద్ విజయం కోరుతూ చల్లపల్లిలో మండలి బుద్ధప్రసాద్ కుమార్తె శీలం కృష్ణప్రభ విస్తృత ప్రచారం చేశారు. బ్రహ్మంగారి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. దళితవాడ, బీసీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. మోర్ల రాంబాబు, చోడగం విమల్ కృష్ణ, పిండి రేవతి, కోట విజయ రాధిక, సర్పంచ్ కృష్ణకుమారి, ముమ్మనేని నాని, పైడిపాముల స్వప్న, వల్లభనేని బాలకోటేశ్వరరావు, సజ్జా చలపతిరావు, బొందలపాటి వీరబాబు, రావి చిట్టి, ఉస్మాన్ షరీఫ్, గాజుల తాతారావు, మోర్ల ప్రసాద్, బోలెం నాగమణి, షేక్ నబీషోరి, పసుపులేటి శ్రీను, వేముల హరికృష్ణ, బళ్లా వాసు, మోర్ల శివ, పోతుమర్తి నాగమణి, బందెల రాఘవులు పాల్గొన్నారు.

50 మంది టీడీపీలో చేరిక



పెడన : గూడూరులోని ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. గోపీ నాగబాబు, అన్నం హరిరామకృష్ణ, దోమ తోటి సుధాకర్, యాసిన్, రహమాన్ తదితర దేశం నాయకులు పాల్గొన్నారు.

తిరుగులేని రాజకీయ శక్తిగా జనసేన

అవనిగడ్డ : జిల్లాలో జనసేన పార్టీ తిరుగులేని రాజకీయశక్తిగా ఎదుగుతోందని, పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి వేలాది మంది వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరుతున్నారని మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. అవనిగడ్డలోని బుద్ధప్రసాద్ ఇంటి వద్ద మోపిదేవి మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత యడ్లపల్లి లక్ష్మణరావు తన అనుచరులతో కలిసి జనసేన పార్టీలోకి చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సహజ వనరుల దోపిడీ తప్ప గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి ఏమీ లేదన్నారు. జనసేన నేత శీలం అశ్విన్ కుమార్, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, గుడివాక శేషబాబు, యాసం చిట్టిబాబు, కోసూరు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నందు ఈనెల 30వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ప్రజలు సూచనలు, సలహాలు సెల్. 9959225466కు తెలియజేయాల్సిందిగా సూచించారు.

అవనిగడ్డలో అందె ప్రచారం

అవనిగడ్డ రూరల్ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అందె శ్రీరామమ్మూర్తి వినూత్న రీతిలో గాంధీ టోపీ ధరించి అవనిగడ్డలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించి పెట్టే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. దిడ్ల వీర రాఘవులు, లెనిన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : మచిలీపట్నం రాడార్ కేంద్రం దగ్గరలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయమూర్తులకు వీడ్కోలు, ఘనస్వాగతం



షేక్ జియావుద్దీన్‌ను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : జిల్లా కోర్టు నుంచి బదిలీపై వెళుతున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. మచిలీపట్నం పోక్సో కోర్టుకు బదిలీపై వచ్చిన న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వరరావుకు ఘన స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షత వహించగా, అతిథిగా మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు విచ్చేశారు. ప్రధాన కార్యదర్శి సిద్ధినేని సత్యసాయిబాబు, సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ, జఫారుల్లా, మధుసూదనరావు, జితేంద్ర, చంద్రాల గోపీకృష్ణ, శ్రీకాంత్, పి.విఫణికుమార్ పాల్గొన్నారు.

కూచిపూడి కళాపీఠంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం



కూచిపూడి : అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధేంద్ర యోగి, నటరాజ స్వామి, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం చిత్రపటాలకు నాట్యాచార్యులు, నాట్య విద్యార్థులు పూలమాలలు వేసి నమఃసుమాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాస్, పసుమర్తి హరనాథ శాస్త్రి, వెంకట దుర్గా భవాని, వైవి.ఫణికుమార్, నాట్య విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి ఆభరణాలు



మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తెనాలికి చెందిన సాయి వెంకయ్య శిష్యబృందం 550 గ్రాముల వెండి ఆభరణాలను సమర్పించారు. సోమవారం వారు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రూ. 47 వేల విలువ గల వెండి ఆభరణాలను ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణకు అందజేశారు.

విద్యార్థినికి లంకిశెట్టి ఫ్రెండ్స్ రూ.1.40 లక్షల ఆర్థిక సాయం



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నానికి చెందిన పేద విద్యార్థిని మృదులకు లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం లక్షా నలభై వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. పదవ తరగతిలో 591 మార్కులు సాధించిన చినముత్తేవి నాగ మృదుల విజయవాడలో ఇంటర్ చదువుకు నేందుకు కావలసిన ఫీజులను లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సమకూర్చింది. అ మేరకు చెక్కును అందజేశారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో న్యాయవాది కమ్మిలి విజయకుమార్, తోట శ్రీనివాస్, మృదులు తల్లిదండ్రులు రవికుమార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలి

గుడివాడ : వైసీపీ అభ్యర్థి కొడాలి నాని, అతని అనుచరులు గుడ్లవల్లేరు మండలం కూరాడ గ్రామానికి చెందిన యువకులపై దాడి చేయడం దారుణమని జనసేన జిల్లా నాయకులు పాలంకి సారధిబాబు అన్నారు. అంజనేయపేటలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతోనే నాని ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని కోరడం కూడా నానీకి తప్పులా ఉందన్నారు. దాడులకు తెగబడిన తన అనుచరులను నాని సమర్థించటం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన గుడివాడ, గుడ్లవల్లేరు చెందిన వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు అడపా వినీత్, పల్నాటి అజయ్‌కుమార్, కోట్లే శివ, అర్జా కృష్ణ, పెద్దిరెడ్డి ఉదయ్‌కుమార్, రామకృష్ణ, జంపా రామనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి : డీఈవో



పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థినిని సత్కరిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 : ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. స్టార్ కాలేజీ ఆధ్వర్యంలో మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్టార్ విద్యా సంస్థల అకడమిక్ మెంటార్ శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో చేతుల మీదుగా ప్రతిభ చూపిన 103 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి సత్కరించారు. దిట్టకవి వెంకటేశ్వరరావు, బి.ఎస్.సి.సింగ్, ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, గురుప్రసాద్, పి. సుబ్రహ్మణ్యం, కొమరగిరి చంద్రశేఖర్, వి. సుందరరాం, ఏ. గౌరీ, అజ్మతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆస్తులు కాజేస్తాడు జాగ్రత్త : గోపు



మచిలీపట్నం టౌన్ : సామాన్య ప్రజల ఆస్తుల కాజేసేందుకే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్టును తీసుకు వచ్చిందని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ విమర్శించారు. టీడీపీ మచిలీపట్నం పార్లమెంటు కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలో ఒరిజనల్ డాక్యుమెంట్లు ప్రభుత్వం తన వద్దే ఉంచుకుని జిరాక్స్ కాపీలు మాత్రం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలో కొనసాగితే ప్రజలకు భూ హక్కు లేకుండా పోతుందన్నారు. రైతులందరూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగురైతు ఉపాధ్యక్షుడు వేముల శివాజీ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వీరంకి మునేశ్వరరావు, నగర తెలుగు రైతు అధ్యక్షుడు ఆళ్ల మాధవ, నగర కార్యదర్శి బడే రమణ, ఎర్రంశెట్టి నాని, గోపు నరేష్, సిహెచ్ నాగబాబు పాల్గొన్నారు.

వడగాడ్పులకు గురికాకుండా జాగ్రత్త వహించాలి

మచిలీపట్నం టౌన్ : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ, వడగాడ్పులకు గురి కాకుండా వృద్ధులు, పిల్లలు జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జి. గీతాబాయి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల వైద్యులు, సిబ్బంది సమావేశంలో గీతాబాయి మాట్లాడారు. వృద్ధులు ఉదయం 10 గంటలలోపు పని ముగించుకుని ఇళ్లకు చేరాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళితే టోపీలు, ముసుగులు ధరించాలన్నారు. ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుల నిల్వలు ఉంచాలన్నారు. డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సీతాకుమారి, డీఐవో బి. రామారావు, డీఎంవో డాక్టర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

కాగిత వెంకట్రావుకు టీడీపీ నాయకుల నివాళి



పెడన : చేపట్టిన ప్రతి పదవికి కాగిత వెంకట్రావు వన్నె తెచ్చారని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. మాజీ శాసనసభ్యుడు, మాజీ చీఫ్ విప్ స్వర్గీయ కాగిత వెంకట్రావు వర్ధంతి కార్యక్రమం పట్టణ టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాలరావు మాట్లాడుతూ, కాగిత వెంకట్రావును నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తొలుత కాగిత వెంకట్రావు చిత్రపటానికి నివాళుల ర్పిం చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖయూం (హన్ను), యక్కల శ్యామలయ్య, పూలబాబు, వహబ్‌ఖాన్, మట్టా నాని, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా తదితర నాయకులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు బాలశౌరి, మండలి పరామర్శ

అవనిగడ్డ : ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ల సందర్భంగా ర్యాలీ రోజు టపాసులు పేలి ఇల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన యాసం శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులను జనసేన పార్టీ అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరి సోమవారం పరామర్శించారు. ఘటన జరగటానికి గల కారణాలను బాలశౌరి బాధితులను అడిగి తెలుసుకుని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజమోహనరావు, గుడివాక శివరావు తదితరులు పాల్గొన్నారు.